


వేతన వ్యథలు...!



వ్యవసాయ సీజన్ ముగిసింది. సొంతూళ్లలో పనులు లేవు. ఉపాధి హామీ పథకం కింద పనులు చేపట్టినా రోజంతా మట్టిలో స్వేదం చిందిస్తే రూ.250-300లకు మించి కూలీ గిట్టుబాటు కావడం లేదు. ఆ డబ్బయినా ప్రతి వారం ఇస్తున్నారా..? అంటే అదీలేదు. ఐదారు వారాలుగా బకాయి ఉంటోంది. ఎన్నాళ్లు పస్తులతో పనులు చేసేది..? అంగడికి వెళితే అరువు పుట్టదు.. ఉపాధి పనులకెళ్తే వేతనాలు వెంటనే అందని పరిస్థితి. ఇక చేసేదేమీ లేక వలస శర్యణం..! అంటూ వలస బండెక్కిసాగిపోతున్నారు. జిల్లాలో ఉపాధి వేతనాలు రూ.22 కోట్ల బకాయి చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు ఎప్పుడిస్తారో..? చెప్పలేని స్థితిలో అధికారులు ఉండిపోతున్నారు. మెటీరియల్ కాంపోనెట్ బకాయిలు సైతం రూ.40 కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఉపాధి కూలీల ఆకలి తీర్చాలని పలువురు కోరుతున్నారు.

- ఉపాధి కూలీలకు ఆరు వారాలుగా అందని కూలి
- జిల్లాలో రూ.22 కోట్ల బకాయి
- మెటీరియల్ కాంపోనెట్ బకాయి రూ.40 కోట్ల పైమాటే
- బతుకు పోరులో వలస కూలీలు

కర్నూలు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం నియోజకవర్గాల్లో 25 మండలాలు, 484 గ్రామ పంచాయతీలు, 237 మజారా గ్రామాలు ఉన్నాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్‌జీఎస్) అమలులో భాగంగా 3.32 లక్షల జాబ్ కార్డులు జారీ చేశారు. అందులో పనులకు హాజరయ్యే యాక్టీవ్ జాబ్ కార్డులు 2.63 లక్షలు వరకు ఉన్నాయని డ్వామా రికార్డుల ద్వారా తెలుస్తోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 70 లక్షల పని దినాలు కల్పించాలని లక్ష్యం. కొత్త, పాత కలిపి 54 వేల పనులు గుర్తించారు. 10,305 పనులు పూర్తి చేయగా.. 44 వేల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. 2024 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకు రూ.303.44 కోట్లు ఖర్చు చేశారు. అందులో కూలీల వేతనాలు (లేబర్ బడ్జెట్) రూ.213.55 కోట్లు కాగా.. మెటీరియల్ కాంపోనెంట్ రూ.73.04 కోట్లు ఖర్చు చేసినట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. మరో నెలన్నరలో ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. అయినా ఆరు వారాలుగా ఉపాధి కూలి డబ్బులు అందడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



హొళగుంద మండలం కోగిలతోట గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

● రూ.22 కోట్ల బకాయి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కోసం డ్వామా అధికారులు జిల్లాను ఆదోని, ఆలూరు, కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు ఐదు క్లస్టర్లుగా విభజించారు. ఒక్కో క్లస్టర్ కింద ఐదు మండలాలు ఉన్నాయి. ప్రతి మండలంలో కనిష్ఠంగా 2,500 మందికి, గరిష్ఠంగా 7,800 మంది చొప్పున ప్రతి రోజు జిల్లాలో లక్ష మందికి ఉపాధి పని కల్పించాలని లక్ష్యం. అయితే ప్రస్తుతం 55-60 వేల మందికి మించి ఉపాధి పనులకు రావడం లేదని తెలుస్తోంది. ప్రధాన కారణం రోజంతా కష్టపడితే సగటున రూ.250-288లకు మించి కూలిడబ్బు పడడం లేదు. ఆ డబ్బు కూడా ఆరు వారాలుగా బకాయి ఉంది. ఒక్కో కూలీకి సగటున రూ.8,500 నుంచి రూ.10 వేల వరకు చెల్లించాల్సి ఉందని సమాచారం. జిల్లాలో రూ.22 కోట్లకు పైగా బకాయి ఉంది. జనవరి 5వ తేది వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన కూలీలకు కూలి సొమ్ము వచ్చిందని అంటున్నారు. అంటే డిసెంబరు ఆఖరి వారం వరకు డబ్బులు వచ్చింది. జనవరి మొదటి వారం నుంచి ఈ రోజు వరకు అంటే ఆరు వారాలుగా ఉపాధి వేతనాలు అందక కూలీలు అవస్థలు పడుతున్నారు.

క్లస్టర్ వారీగా ఉపాధి పనులు చూపాల్సిన లక్ష్యం (లేబర్ టార్గెట్), పనులకు హాజరు అవుతున్న కూలీల సంఖ్య వివరాలు

క్లస్టర్	కూలీల లక్ష్యం	పనులకు వచ్చేవారు	శాతం
ఆదోని	23,800	15,236	64.02
ఆలూరు	26,500	10,045	60.88
కర్నూలు	20,400	11,235	55.07
పత్తికొండ	22,500	15,143	76.30
ఎమ్మిగనూరు	15,800	9,486	60.04
మొత్తం	1,00,000	61,146	61.15



కోసిగి నుంచి వలస వెళ్తున్న కూలీలు

● వలసలే శరణ్యం

ఊళ్లో వ్యవసాయ పనులు లేవు. ఉపాధి పనులకు వెళ్తే ఆరు వారాలైన కూలి ఇవ్వడం లేదు. దీంతో చేసేది లేక వలసలే శరణ్యం అయ్యాయి. ఇప్పటికే జిల్లాలో నుంచి 1.50 లక్షల కుటుంబాలు వలస బండెక్కి. గుంటూరు, తెలంగాణ ప్రాంతాలకు మిరక కోత, పత్తి తీత పనులకు వెళ్లిపోయారు. ఊళ్లో దేవరలు, జాతరలు చేసి మిగిలిన వాళ్లు కూడా వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉపాధి కూలీ బకాయిలు చెల్లించడంతో పాటు ఉన్నవాళ్లకు పనులు కల్పించి వలసలు ఆపాలని పలువురు కోరుతున్నారు.

మిగతా 6లో...

కర్నూలులో బర్డ్ ఫ్లూ

ఎన్ఆర్ పేటలో పది కోళ్లు మృతి

రెడ్ జోన్‌గా ప్రకటించిన అధికారులు

కలెక్టర్ అత్యవసర సమావేశం



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట కర్నూలు జిల్లాలో బర్డ్ ఫ్లూ ఆనవాళ్లు లేవని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నామని పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రకటించారు. అయితే.. చాపకింద నీరులా బర్డ్ ఫ్లూ కర్నూలు నగరంలో వ్యాపిస్తోందని గురువారం బయట పడింది. దీంతో నగరంలో కలకలం రేగింది. కర్నూలు నగరంలోని ఎన్ఆర్‌పేటలో పది కోళ్ల మృతి చెందినట్లు పశుసంవర్ధకశాఖ అధికారులు గుర్తించారు. మృతి చెందిన ఒక కోడి శాంపుల్స్‌ను ల్యాబ్‌లో నిర్ధారణ కోసం పంపించగా.. పాజిటివ్ రావడంతో వెంటనే ఎన్ఆర్ పేటలో రెడ్‌జోన్‌గా ప్రకటించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. మృతి చెందిన 9 కోళ్లను బయటి ప్రదేశాలకు తరలించి గుంత తీసి పూడ్చినట్లు పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ రాత్రి 8 గంటల సమయంలో తెలియజేశారు. కలెక్టర్‌కు ముందస్తు సమాచారం అందించడంతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఎన్ఆర్ పేటకు కిలోమీటరు పరిధిలో రెడ్ జోన్ హెచ్చరికలు అమలులో ఉంటాయని, కోళ్లను, గుడ్లను వ్యాపారుల అమ్మకుండా నిషేధం విధించాలని కలెక్టర్ రంజిత్ బాషా పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. పది కిలోమీటర్ల పరిధిలో శుక్రవారం నుంచి మొదలు పెట్టి సర్వే పరిస్థితులను సమీక్షించాలని ఆదేశాలు జారీ చేసినట్లు జేడీ తెలిపారు. శుక్రవారం ఎన్ఆర్ పేట కాలనీల్లో తమ అధికారులు, సిబ్బంది కోళ్ల దుకాణాలను పర్యవేక్షిస్తారని బర్డ్ ఫ్లూ తీవ్రతపై పరీక్షలు నిర్వహిస్తారని జేడీ తెలిపారు. పంచలింగాలతో పాటు ఆదోనిలో నాలుగు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని, బయటి ప్రాంతం నుంచి కోళ్ల రాకుండా చర్యలు చేపట్టినట్లు జేడీ శ్రీనివాస్ తెలిపారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర

క్వింటా రూ.7,471



ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు గురువారం స్వల్పంగా పెరిగాయి. గత వారంతో పోల్చితే క్వింటానికి రూ.150ధర పెరిగింది. పత్తి ధర క్వింటాళ్లు గరిష్ఠంగా రూ.7471 పలికింది. కొద్ది రోజులుగా పత్తి ధరలు పతనం కావడంతో పత్తి రైతులు దిగాలు చెందారు. మళ్లీ స్వల్పంగా పత్తి ధరల్లో కదలికలు రావడంతో ధరలపై రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. 805 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.4112, గరిష్ఠ ధర రూ.7471, మధ్య ధర రూ. 7189 పలికింది.

శ్రీమఠానికి రూ.40 లక్షల విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠానికి యూఎస్ఏకు చెందిన సింధు అనే ప్రవాస భారతీయురాలు రూ.40 లక్షలు అన్నదానం, గోశాల, శ్రీమఠం అభివృద్ధి పనులకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ వెంకటేష్ జోషిలు తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.40 లక్షలు డీడీ రూపంలో విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షింతలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జేపీ స్వామి, నరసింహ దేశాయ్, గిరిధర్, శ్రీపాద ఆచార్ తదితరులు ఉన్నారు.

శ్రీశైల పాదయాత్రికులకు మెరుగైన సేవలు

ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా

ఆత్మకూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మార్చి 1 వరకు జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కాలినడకన తరలివచ్చే యాత్రికులకు అటవీశాఖ తరఫున సౌకర్యవంతమైన సేవలు కల్పిస్తున్నట్లు ఆత్మకూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ సాయిబాబా పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శ్రీశైల పాదయాత్రికుల కోసం ఇప్పటికే నడక మార్గంలో జంగిల్ క్లియరెన్స్, ఫైర్‌లైన్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 17 పాదయాత్రికుల కోసం తమ సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులోకి ఉంటారన్నారు. అటవీ మార్గంలో సూచిక బోర్డుల ఏర్పాటుతోపాటు పర్యావరణ పరిరక్షణ అంశాలు, జాగ్రత్తలను గుర్తు చేసేలా ప్రచార బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. కమ్యూనికేషన్ కోసం వైర్‌లెస్ వాకీటాకీలను వినియోగించనున్నట్లు వివరించారు. కాగా శ్రీశైలానికి వచ్చే పాదయాత్రికులు ప్లాస్టిక్ కవర్లు, ఇతర హానికర వస్తువులను తీసుకురావద్దని సూచించారు. పాదయాత్రికులు పర్యావరణహితంగా తమ యాత్రను పూర్తి చేసుకుని అటవీశాఖకు సహకరించాలని ఆకాంక్షించారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు గురువారం జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 56 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 2,306 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 2,272 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 34 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స పరీక్షలకు 63 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 2,543 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 2,492 మంది పరీక్షకు హాజరు కాగా, 51 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి తదితరులు పర్యవేక్షించారు.

పేదలకు రుణాలు మంజూరు చేయండి

బ్యాంకర్లకు కలెక్టర్ ఆదేశం

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అర్హులైన పేదలకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా బ్యాంకర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటి (డీసీసీ) సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు రుణాల మంజూరు గురించి బ్యాంకర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలన్నారు. అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించి 24 శాతం మాత్రమే మంజూరు చేశారని, ఇంకా రూ.60 కోట్ల రుణాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఎంఎంఎస్ఎంఈలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, కరూరు వైశ్య బ్యాంకు, ధనలక్ష్మి బ్యాంకు యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్యాంకులు నిర్ధేశించిన లక్ష్య సాధనలో వెనుకబడి ఉన్నాయన్నారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ కార్యక్రమానికి సంబంధించి పెండింగ్‌లోఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో కెనరా బ్యాంకు ఆర్ఎం సుశాంత్ కుమార్, ఆర్‌బీఐ లీడ్ బ్యాంకు ఆఫీసర్ అభిషేక్, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఎల్డీఎం రామచంద్రరావు, ఎస్సీ, ఎస్టీ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజా మహేంద్రనాథ్, దళిత ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కోఆర్డినేటర్ దిలీప్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీడీ 3.0 స్క్రీనింగ్‌ను అప్‌లోడ్ చేయండి : డీఎంహెచ్ఓ



స్కీనింగ్ క్యాంపును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీడీ 3.0 స్క్రీనింగ్ సర్వే వివరాలను అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని రోజా అర్బన్ హెల్త్ సెంటరులో జరుగుతున్న ఎన్‌సీడీ స్క్రీనింగ్ సర్వేను డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా గత ఏడాది నవంబరు 2024న ఎస్‌సీడీ 3.0 స్క్రీనింగ్‌ను ప్రారంభించిందన్నారు. ఇందులో 18 ఏళ్లు పైబడిన వారికి రోజుకు 40 మంది చొప్పున స్టాఫ్ నర్సు, ఏఎన్ఎం, ఆశాలు బృందం ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. శ్వాసకోశ వ్యాధులు, సురక్షిత తాగునీటి, ఆహార భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఐవో నాగప్రసాద్, డీపీఎంవో ఉమా, డెమో శ్రీనివాసులు శెట్టి, మెడికల్ ఆఫీసర్లు ఫాతిమా, నందిని, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మ్యుటేషన్లు చేస్తే చర్యలు

- క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టండి
- సమీక్షలో కలెక్టర్ రంజిత్ బాషా



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్‌వోఆర్ యాక్టు ప్రకారం నోటీసులు ఇవ్వకుండా ఇష్టానుసారంగా భూముల మ్యుటేషన్ చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ పి.రంజిత్ బాషా తహసీల్దార్లను హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో మ్యుటేషన్లకు సంబంధించి నిర్వహించాల్సిన చర్యలు, ఫీల్డ్ విజిట్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం మ్యుటేషన్, సర్వే ప్రక్రియ జరగాలన్నారు. ఆర్‌వోఆర్ యాక్టు ప్రకారం మ్యుటేషన్ చేసేటప్పుడు సంబంధించిన సర్వే నెంబరులోని పట్టాదారులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వడంతో పాటు పబ్లిక్ నోటీసు కూడా ఇవ్వాలన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత పొజిషన్‌లో ఉన్నారా..? ప్రభుత్వ భూమి, పట్టా భూమి అనే వివరాలను వీఆర్వో క్షేత్రస్థాయిలో విచారణ చేయాలన్నారు. వెబ్‌ల్యాండ్‌లో అన్ని రికార్డులను సరి చూసుకుని సక్రమంగా ఉన్నాయా అని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే మ్యుటేషన్ చేయాలన్నారు. ఆర్డీవోలు వారి స్థాయిలో చెక్ చేసిన తర్వాత ప్రతి నెలా అన్ని మండలాల నుంచి మ్యుటేషన్ ఫైల్స్‌ను కలెక్టరేట్‌కు తెప్పించుకుని వెరిఫై చేయాలని డీఆర్వోను ఆదేశించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టుగా జరుగుతున్న రీసర్వే ప్రక్రియను సవాలుగా తీసుకుని నిబంధనల ప్రకారం నిక్కచ్చిగా చేయాలన్నారు. కొందరు వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు పాస్‌బుక్‌లు ఇచ్చేటప్పుడు సర్వేకి డబ్బు అడిగారనీ తమకు ఫీడ్‌బ్యాక్ వచ్చిందన్నారు. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీవోలు, తహసీల్దార్లు, సర్వే శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్లు పాల్గొన్నారు.


షిరిడీ సాయిబాబాకు పూజలు చేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి


విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు


భారీగా తరలివచ్చిన భక్తులు

కన్నుల పండువగా ఉత్సవం

● షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ
● భారీగా తరలివచ్చిన భక్తులు



డోన్ రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణ సమీపంలో నూతనంగా నిర్మించిన షిరిడీ సాయి బాబా మందిరంలో గురువారం షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. తెల్లవారు జాము నుంచి షిరిడీ సాయి మందిరంలో విశేష పూజ కార్యక్రమాలు జరిగాయి. షిరిడీ సాయిబా బాబా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ఆయన సతీమణి మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ దంపతులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రతాప్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని పూజలు చేశారు. అంతకు ముందు షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, కోట్ల దంపతులకు, టీడీపీ సీనియర్ నాయకుడు కేఈ ప్రతాప్, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులకు కమిటీ సభ్యులు సోదారహంగా ఘన స్వాగతం పలికారు. షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. బాబాను దర్శించుకున్న భక్తులకు షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు చాటకొండ శ్రీనివాసులు కొండా సురేష్, పార్థసారథి, ఆలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు భక్తులు పాల్గొన్నారు.

● **బందోబస్తు నిర్వహించిన పోలీసులు:**

షిరిడీ సాయిబాబా ప్రాణప్రతిష్ఠ విగ్రహ కార్యక్రమానికి వచ్చిన భక్తులను దృష్టిలో ఉంచుకుని డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ సీఎం రాకేష్ పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. షిరిడీ సాయిబాబా మందిరం ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అన్నదాతలకు తీపి కబురు

● ఏప్రిల్ 1 నుంచి కొత్త పాసు పుస్తకాలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రైతన్నలకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏప్రిల్ 1 నుంచి ఆంధ్రప్రదేశ్ రాజముద్ర ఉన్న కొత్త పాసు పుస్తకాలను పంపిణీ చేయాలని రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించింది. గత వైసీపీ ప్రభుత్వంలో భూములన్నీ తన కష్టార్జితం అన్న రీతిలో నాటి సీఎం జగన్ భూహక్కు పత్రాలపై తన బొమ్మతో కూడిన పత్రాలను రైతులకు పంపిణీ చేశారు. దీంతో రైతులు తమ పూర్వీకుల నుంచి సంక్రమించిన తమ భూములకు జగన్ ఫొటో ఉండటంపై అసహనం వ్యక్తంచేశారు. పైగా గత వైసీపీ ప్రభుత్వంలో అందజేసిన పాసు పుస్తకాల్లో కూడా తప్పులు అధికంగా ఉండటంతో బ్యాంకర్లు పంట రుణాలను ఇచ్చేందుకు నిరాకరించారు.

● మార్చి నాటికి సర్వే రాళ్లపై జగన్ బొమ్మల తొలగింపు

గత వైసీపీ జగన్ హయాంలో రైతుల పొలాల సరిహద్దులను నిర్ణయిస్తూ పాతిన రాళ్లపై ముద్రించిన జగన్ బొమ్మతో పాటు రాతలను కూడా చెరిపేసేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పొలాల సరిహద్దులను నిర్ణయించడంలో జరిగిన తప్పు ఒప్పులను నిర్ణయించేందుకు ప్రతి మండలానికి ఒక గ్రామం చొప్పున మొదటి విడతగా అధికారులు రీసర్వే ప్రారంభించారు. ఈ రీసర్వే మార్చిలోపు పూర్తి చేసి రైతుల పొలాలను సక్రమంగా వారి చేతికి అందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం రైతుల పొలాల్లో పాతిన జగన్ బొమ్మతో కూడిన రాళ్లను బొమ్మలను, రాతలను చెరిపివేసే కార్యక్రమాన్ని చేపట్టారు.

దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నడిచే మీడియేషన్ సెంటర్లలో మధ్యవర్తులుగా సేవలందించేందుకు ఆసక్తిగలిగి ఉన్న అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు గానూ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన సామాజిక కార్యకర్తలు, 15 సంవత్సరాల పాటు ఆయా రంగాల్లో అనుభవం కలిగిన నిష్ణాతులు, పదవీ విరమణ చేసిన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 17వ తేదీ లోపు జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన ప్రకటనలో కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు రేవతి ఎంపిక



నంద్యాల హస్పిటల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా క్రీడాకారిణి రేవతి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల కబడ్డీ అసోషియేషన్ సెక్రటరీ ఏపీ రెడ్డి తెలిపారు. ఐదు సంవత్సరాలుగా ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లా అసోసియేషన్ తరపున రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటూ ఎన్నో జాతీయ స్థాయి జూనియర్ పోటీల్లో పాల్గొని నంద్యాల జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చిన రేవతికి ఉమ్మడి జిల్లాల కబడ్డీ అసోసియేషన్ తరపున అభినందనలు తెలియజేశారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు హర్యానా రాష్ట్రంలోని పానిపట్‌లో జరిగే సీనియర్ నేషనల్ క్రీడల్లో కూడా మంచి ప్రతిభ చూపి నంద్యాల జిల్లాకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి పోలీసు స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో 149ఆఫ్ ఐపీసీ కింద ఐదుగురిపై నమోదైన కేసులోని ముద్దాయిలకు ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గురువారం శిక్ష విధించినట్లు ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసులో ఒకరు చనిపోగా నలుగురు ముద్దాయిలైన బాలయ్య, గడ్డ కిషోర్, లక్ష్మీదేవి, అశోక్‌లపై ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు నంబరు 36-2019 కేసును జడ్జి శైలజ విచారణ జరిపి నలుగురికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారని అన్నారు. ప్రాసిక్యూషన్ తరపున ఆళ్లగడ్డ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. శివప్రసాద్‌రావు తమ వాదనలను వినిపించారు.

జిల్లెల-1 ఎంపీటీసీ రాజీనామా


రాజీనామా పత్రాన్ని సీఈఓకు అందజేస్తున్న ఎంపీటీసీ రమాదేవి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా గోస్పాడు మండలం జిల్లెల-1 ఎంపీటీసీ సభ్యురాలు గోటికె రమాదేవి రాజీనామా చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డికి రాజీనామా పత్రాన్ని అందజేశారు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు రమాదేవి వెల్లడించారు.


చౌడేశ్వరిదేవి అమ్మవారు


అమ్మవారి రథోత్సవం

ఘనంగా చౌడేశ్వరీ దేవి రథోత్సవం

●భారీగా తరలి వచ్చిన భక్తులు● కిక్కిరిసిన కోడుమూరు

కోడుమూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చౌడేశ్వరీ దేవి ఉత్సవాల్లో భాగంగా గురువారం అటగార దేవాంగ దైవాచార సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రథోత్సవం తిలకించేందుకు భక్తులు భారీ ఎత్తున కోడుమూరు పట్టణానికి చేరుకున్నారు. దీంతో పట్టణం పురవీధులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. రథోత్సవ సందర్భంగా ఉదయం నుంచి చౌడేశ్వరీదేవి మాతకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన వంటి పూజా కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం పూలు, మామిడి తోరణాలతో రథాన్ని అలంకరించారు. చౌడేశ్వరీదేవి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం విగ్రహాన్ని రథంపై కొలువు ఉంచారు. అశేష భక్తుల మధ్య రథోత్సవం కన్నుల పండువగా సాగింది. అడుగడుగునా భక్తులు అమ్మా జగన్మాతా అంటూ రథంపై పూలు కురిపించారు. సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు అదనపు బలగాలను రప్పించి బందోబస్తు చేపట్టారు. రథోత్సవం అనంతరం అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఆలయంలోకి క్యూ కట్టారు. దీంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వైసీపీ నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. జడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి ఆర్యవైశ్య మహాసభ ప్రథమ అధ్యక్షులు జయంతి వెంకటేశ్వర్లు, బీజేపీ నాయకులు మురళీనాయుడు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు తిరుగు రథోత్సవం :

చౌడేశ్వరీదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తిరుగు రథోత్సవం నిర్వహించనున్నారు. శనివారం పారువేట, ఆదివారం వసంతోత్సవముతో అమ్మవారి ఉత్సవ వేడుకలు పూర్తవుతాయని అటగార దేవాంగ దైవాచార సంఘం సభ్యులు తెలిపారు.

● **మురిపించిన ముద్దు పాపల పోటీలు**

చౌడేశ్వరిదేవి జాతర పురస్కరించుకొని గురువారం సాయంత్రం సంతమార్కెట్లో చేపట్టిన చిన్నారి ముద్దు పాపల పోటీలు ప్రజలను మురిపించాయి. ఈ పోటీల్లో 0 నుంచి 1, 3 సంవత్సరాల చిన్నారులను వివిధ వేషధారణలతో పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలను చూసేందుకు పెద్ద ఎత్తున మహిళలు కదలి వచ్చారు. ఈ పోటీల్లో గెలుపొందిన పిల్లలకు బంగారపు ఉంగరాలను సాక్రె వీరన్న బహూకరించనున్నారు.

వేతన వ్యథలు..!

(5వ పేజీ తరువాయి)


కోడుమూరు మండలం ముడుములగుర్తి గ్రామంలో ఉపాధి పనుల్లో కూలీలు

● **సీసీ రోడ్లకు బిల్లులు రూ.40 కోట్లు**

మెటీరియల్ కాంపోనెంట్ అమౌంట్ రూ.40 కోట్ల బకాయి ఉంది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, కల్వర్టు పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లులు అందక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో సర్పంచులు, టీడీపీ కూటమి, గ్రామీణ నాయకులు అప్పులు చేసి పనులు చేస్తే.. సకాలంలో బిల్లులు రాక అప్పులపాలు అవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● **మూడు వారాల కూలి డబ్బు రావాలి**



మా ఊళ్లోనే నేను, నా భార్య, ముగ్గురు కొడుకులు, కోడళ్లు.. మొత్తం ఎనిమిది మంది ఉపాధి పనులకు వెళ్తున్నాం. రోజంతా కష్టపడితే రూ.250 కూడా గిట్టుబాటు కావడం లేదు. అయినా ఊళ్లోనే కాదా అని మట్టి పనులకు వెళ్తున్నాం. మూడు వారాలుగా ఉపాధి కూలి డబ్బు రూ.41 వేలు రావాల్సి ఉంది. అధికారులను అడిగితే అప్‌లోడ్ చేశాం.. ఏదో ఒకరోజు మీ అకౌంట్లో పడుతాయని అంటున్నారు. తిండిగింజలకు అప్పు పుట్టడం లేదు. అంగడికి వెళితే ఉద్దర ఇవ్వమంటున్నారు. చేసేది లేక ఉపాధి పనులు ఆపేసి రోజు కూలి వచ్చే పనులు వెతుక్కుంటున్నాం. రేపోమాపో వలస వెళ్లక తప్పని పరిస్థితి.

– బోయ వెంకటేశ్, కోగిలితోట గ్రామం, హొళగుంద మండలం

● **ఆరు వారాలు నుంచి డబ్బు ఇవ్వడం లేదు**



నేను ఒంటిరి మహిళను. కూలీనాలి చేసుకొని జీవనం సాగిస్తున్నాను. ఊళ్లోనే ఉపాధి పనులకు వెళ్తున్నాను. ఆరు వారాల నుంచి కూలి డబ్బులు ఇవ్వలేదు. ఇతర పనులకు వెళ్దామంటే వ్యవసాయ పనులు లేవు. చేతిలో చిల్లిగవ్వ లేదు. బతకడానికి చాలా ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం మా గోడు పట్టించుకొని వెంటనే ఉపాధి వేతనాలు చెల్లించాలి.

– అయ్యమ్మ, ఎర్రదొడ్డి గ్రామం, కోడుమూరు మండలం

● **బ్యాంక్ ఖాతా చెక్ చేసుకోవాలంటున్నారు**



నా భార్య గోవిందమ్మ, నేను ఇద్దరం ఉపాధి పనులకు వెళ్తున్నాం. నాలుగు వారాలుగా మాకు కూలి డబ్బు ఇవ్వలేదు. అధికారులను అడిగితే ఏదో ఒకరోజు డబ్బు వస్తుంది.. బ్యాంక్ ఖాతాను చెక్ చేసుకోవాలని అంటున్నారు. నిత్యం బ్యాంక్ ఖాతా చెక్ చేసుకుంటున్నాం. కరెంట్ బిల్లు, గ్యాస్ బిల్లు, రోజువారి ఖర్చులకు ఇబ్బందులు పడుతున్నాం. ఎలా నెట్టుకురావాలో అర్థం కావడం లేదు.

– శివయ్య, వర్కూరు గ్రామం, కోడుమూరు మండలం

● **రూ.22 కోట్ల బకాయి ఉంది**

జిల్లాలో ఉపాధి హామీ కూలీలకు రూ.22 కోట్లు వేతన బకాయి ఉన్నమాట నిజమే. జనవరి 5వ తేది వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన వారందరికి ఖాతాలో డబ్బు పడింది. ఆ తరువాత వేతనాలు రావాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. మెటీరియల్ కాంపోనెంట్ అమౌంట్ రూ.40 కోట్లు బకాయి ఉంది.

– వెంకట రమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు


పూజలందుకున్న మద్దమ్మవ్వ

వినియోగదారుల హక్కులను కాపాడాలి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులను కాపాడేలా ప్రభుత్వ శాఖలు గట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు, కూరగాయలు అమ్మే దుకాణాలను నిత్యం తనిఖీ చేస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. హోటళ్లు, సూపర్ మార్కెట్లు, ఎంఎల్ఎస్ పాయింట్లు, పెట్రోల్ బంకు, మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తూకాల్లో మోసాలు, కల్తీ ఆహారం, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయంలాంటి మోసాలను అరికట్టాలన్నారు. వ్యవసాయ మార్కెట్లలో మిర్చి, పత్తి, ఇతర ధాన్యాల సేకరణ సమయంలో పెద్ద ఎత్తున జరిగే అమ్మకాల్లో తూకాల్లో ఎక్కువ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను సూచించారు. అన్ని ప్రభుత్వ సంస్థల్లో తాగునీటి ఏర్పాటు వంటి కనీస వసతులను ఏర్పాటు చేయాలని, అలాగే ప్రైవేటు సంస్థల్లో కూడా ఏర్పాటు చేసేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటల్స్‌లో దివ్యాంగుల కోసం ర్యాంపులు, తాగునీటి వంటి వసతులను ఏర్పాటు చేయాలన్నారు. స్కానింగ్ సెంటర్లలో తగిన సదుపాయాలు కల్పించాలన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా క్లోరినేషన్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ, ఫుడ్ సేఫ్టీ, ఆర్టీసీ, మున్సిపాలిటీలు తదితర అన్ని శాఖలు వినియోగదారుల హక్కులకు భంగం కలగకుండా గట్టిగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, కర్నూలు అదనపు మున్సిపల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ, ఆదోని మున్సిపల్ కమిషనర్ కృష్ణ, వినియోగదారుల సంఘం కార్యదర్శి శివమోహన్ రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి పాల్గొన్నారు.

వైభవంగా మద్దమ్మ జాతర

● అశేషంగా కదిలి వచ్చిన జనం


రథం ముందు ఉన్న రాజుల దుస్తులతో ఉన్న యాదవ రాజులు

మద్దికెర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్దికెర గ్రామ దేవత మద్దమ్మ జాతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. మద్దమ్మ జాతర మహోత్సవం కన్నుల పండువగా అశేష జనవాహిని మధ్య జరిగింది. గురువారం తెల్లవారుజామున అమ్మవారి ఖడ్గానికి వైభవంగా కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు అమ్మవారికి తలంబ్రాలు పోసి చదివింపులు చదివించారు. అనంతరం ఉదయం మద్దికెర గ్రామ దేవత మూలవిరాట్ మద్దమ్మవ్వకు పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మధ్యాహ్నం గ్రామానికి చెందిన జంబునాథ్‌రాయుడు, సంధ్యారాణి, శ్రీనివాసులు, ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి రథోత్సవం నిర్వహించేందుకు యాదవ రాజులుగా పిలువబడుతున్న చిన్న నగిరి, పెద్ద నగిరి యాదవరాజులు రాజు దుస్తులు ధరించుకుని తరలిరాగా రథోత్సవం ముందు హోమం నిర్వహించారు. అనంతరం రథోత్సవం ముందు యాదవ రాజులు ఉండగా అశేష జనవాహిని అమ్మవారి రథాన్ని లాగారు. రథోత్సవం ముందు హోమ పూజలు చేయగా ఉత్సవమూర్తి చిన్న మద్దమ్మను రథంలో ఏర్పాటు చేసి యాదవ వంశీకులైన చిన్న నగిరి, పెద్ద నగిరి వాసులు రథం ముందు రాజు దుస్తులతో ముందుకు రాగా రథాన్ని అశేష భక్తజన వాహని మధ్య ముందుకు లాగారు. అమ్మవారి రథోత్సవంపై భక్తులు అరటి పండ్లు విసిరి భక్తిని చాటుకున్నారు. అనంతరం రాత్రి దేవాలయంలో చెక్కభజన కార్యక్రమాలు, ఉచిత పౌరాణిక నాటకాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సీఐ పులిశేఖర్ గౌడు, ఎస్ఐ విజయకుమార్ నాయక్ బందోబస్తు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దనగిరి, చిన్న నగిరి కులస్థులు భక్తులు పాల్గొన్నారు.

● **మద్దమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు :**

పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు మద్దికెర గ్రామ దేవత మద్దమ్మవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు టీడీపీ నాయకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రథోత్సవానికి కాయలు కొట్టి భక్తిని చాటుకున్నారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

చిన్నటేకూరు విద్యార్థులకు కలెక్టర్ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): చిన్నటేకూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ-మెడికల్ అకాడమిలో చదువుతున్న విద్యార్థులు, జేఈఈ-మెయిన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అభినందించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప ఆధ్వర్యంలో విద్యార్థులు కలెక్టర్‌ను కలిశారు. ఆయన విద్యార్థులను అభినందించి సత్కరించారు. అకాడమీలోని గ్రామాల విద్యార్థులు ర్యాంకులు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. త్వరలో కళాశాలను సందర్శించి విద్యార్థులు ఇంకా మెరుగైన ఫలితాలు సాధించడానికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గురుకుల పాఠశాలల డీసీవో ఐ.శ్రీదేవి, అకడమిక్ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, రిటైర్డ్ పీడీ చంద్రశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

భార్యను చంపిన కేసులో జీవిత ఖైదు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్తకు కోర్టు యావజ్జీవ కారగార జైలు శిక్ష విధించింది. ఆదోని కోర్టు లైజినింగ్ ఏఎస్ఐ నరసింహులు వివరాల మేరకు.. పెద్దకడుబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన కురువ నాగేష్‌కు కోసిగి మండలం సజ్జలగొడ్డంకు చెందిన జయలక్ష్మితో 15 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. పూర్తిగా మద్యానికి బానిస అయిన నాగేష్ తరచూ భార్యతో ఘర్షణకు దిగేవారు. ఈ క్రమంలోనే గత ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ రాత్రి భార్యా భర్తల మధ్య తీవ్రమైన ఘర్షణ చోటు చేసుకుంది. అనంతరం నిద్రలోకి జారుకున్న భార్య జయలక్ష్మి 21వ తేదీన తెల్లవారుజామున నిద్రిస్తున్న ఆమెపై గొడ్డలితో నరికి అతి కిరాతకంగా నాగేష్ హత్య చేశాడు. మృతురాలి తండ్రి ఎల్లప్ప ఫిర్యాదు మేరకు అప్పటి కోసిగి సీఐ ప్రసాద్ కేసు నమోదుచేసి విచారణలో భాగంగా కోర్టుకు అప్పజెప్పారు. గురువారం కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడికి ఆదోని సెకండ్ అడిషనల్ డిస్ట్రిక్ జడ్జి పి.జె సుధా యావజ్జీవ కారగార జైలు శిక్ష విధించారు. మృతురాలి తరఫున పీపీలు మోతిలాల్, శ్రీనివాసులు వాదనలు వినిపించారు.



జైలుకు తరలిస్తున్న పోలీసులు

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

బనగానపల్లె, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన జయమ్మ అనే మహిళపై లారీ టైర్లు ఎక్కటంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. ఈ ఘటన గురువారం రాత్రి జరిగింది. బీసీ కాలనీ నుంచి పెట్రోల్ బంకు సర్కిల్‌కు జయమ్మ నడుచుకుంటూ వస్తుండగా ప్రమాదవశాత్తు లారీ వెనుక టైర్ల కింద పడటంతో రెండు కాళ్లు విరిగి పోయాయి. పోలీసుల జయమ్మను చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

హంద్రీ కాలువలో బాలుడి గల్లంతు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో పడి ఓ బాలుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన మండలంలోని పందికోన గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. పందికోన గ్రామంలో జరిగిన ఆలయాల ప్రారంభ వేడుకలకు డోన్ పట్టణానికి చెందిన దామెదర్ గౌడ్, రామేశ్వరి దంపతుల కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. గురువారం ఉదయం దామోదర్‌గౌడ్ రెండో కుమారుడు తులసి గౌడ్ (11) ఉదయం 11 గంటల సమయంలో గ్రామ సమీపంలో ఉన్న హంద్రీ కాలువలో అదుపుతప్పి పడిపోయాడు. స్థానికులు గమనించి కేకలు వేయడంతో గ్రామానికి చెందిన కొందరు వచ్చి కాలువలో వెతికినా ఆచూకీ దొరకలేదు. విషయం తెలుసుకున్న సీఐ జయన్న తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని, స్థానికులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది సాయంత్రం చీకటి పడే వరకు గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ బాలుడు ఆచూకీ లభ్యం కాలేదు. బాలుడి గల్లంతు కావడంతో తల్లిదండ్రులు, బంధువులు రోదనలు పలువురిని కంటతడిపెట్టించాయి.



తులసి గౌడ్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి

- సర్వీసు రోడ్డు నిర్మించాలని హైవేపై బైఠాయింపు



జాతీయ రహదారిపై బైఠాయించిన గిరిజనులు

పాణ్యం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుగాలిమెట్ట వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజన యువకుడు మృతి చెందాడు. పాణ్యం ఇందిరా కాలనీకి చెందిన తోట ఆంజనేయులు(26), అతని సోదరుడు లక్ష్మన్న ద్విచక్ర వాహనంపై కమలాదిపల్లి నుంచి వెళుతూ సుగాలిమెట్ట వద్ద యూటర్న్ తీసుకుంటున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మన్నకు తీవ్ర గాయాలయ్యాయి. సమా చారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పాణ్యం పోలీసులు పేర్కొన్నారు. హైవే అధికారులు గ్రామంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపించారు.

హైవేపై గిరిజనుల ధర్నా..

హైవే అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని గిరిజనులు, గ్రామస్తులు జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. సర్వీసు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరారు.

మురుగు కాలువలో శిశువు మృతదేహం

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సోగనూరు రోడ్డు అబ్బాస్ టాకీస్ పక్కన ఉన్న మురుగు కాలువలో నవజాత శిశువు మృతదేహం లభించింది. గుర్తు తెలియని వ్యక్తులు శిశువు మృత దేహాన్ని మురుగు కాలువలో పడేసి కాలువపై బండలు పెట్టి వెళ్ళిపోయారు. అయితే స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా శిశువు మృతదేహన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసును దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా ప్రైవేటు వ్యక్తులకు రిజిస్ట్రేషన్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలోని 103 ప్లాట్ల సొసైటీలో సభ్యులుకాని వ్యక్తులకు మాజీ అధ్యక్షుడు నారాయణ అక్రమంగా ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించాడని ఆ సంఘం మాజీ అధ్యక్షుడు నాగరాజు ఆరోపించాడు. గురువారం జరిగిన సొసైటీ మాజీ బోర్డు డైరెక్టర్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2005 జూన్ నుంచి 2016 ఫిబ్రవరి వరకు సంస్థ అధ్యక్షుడిగా ఉన్న నారాయణ 1200 పైగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేశాడని అన్నాడు. ఇందులో 102 ప్లాట్లు సొసైటీలో సభ్యులు కాని వాళ్లకు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించాడని ఆరోపించాడు. దీని మీద అప్పటి కలెక్టర్ 2014లో ఐదుగురితో కమిటీతో విచారణ జరిపించి 102 ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలకృష్ణ, నరసింహులు, అబ్రహాం, మద్దిలేటి, హరిశ్చంద్ర, లోకేశ్, అచ్చన్న పాల్గొన్నారు.

'చెత్త వాహనాలు' అంతేనా..?

- మరమ్మతులు చేయించడంలో అధికారుల కాలయాపన
- రిపేరీ పనుల్లో రూ.28 లక్షలు పెండింగ్



కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో చెత్త తొలగించేందుకు వాడే వివిధ రకాల వాహనాలు మరమ్మతు కారణంగా చెత్త సేకరణకు పనికి రావడం లేదు. దీంతో పారిశుధ్య పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ వాహ నాలకు అధికారులు మరమ్మతు చేయించడం లేదు. గత సంవత్సరం వాహనాల మరమ్మతు పనులకు సుమారు రూ.42 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉండేవి. అప్పటి నుంచి రిపేరీ చేసే షోరూంలోనే ఉండిపోయాయి. కమిషనర్‌గా రవీంద్రబా బు బాధ్యతలు చేపట్టాక రూ.14 లక్షలు చెల్లించారు. దీంతో కొన్ని వాహనాలను పారిశుధ్య పనుల్లో విని యోగిస్తున్నారు. మర మ్మతు చేయకపోవ డంతో ఇంకా 19 వాహనాలు నిరుపయోగంగా ఉండిపో యాయి. 19, ప్రైవేటు ఆసుప త్రుల సౌజన్యంతో మరో నాలుగు కలిసి 23 ట్రాక్టర్లు ఉన్నాయి. అదే విధంగా కంపాక్టర్లు పెద్దవి 5 ఉన్నాయి. చిన్నవి 10 ఉండగా 4 షోరూంలో ఉన్నాయి. నగర పాలక సంస్థకు 13 ఆటోలు ఉండగా ఒకటి రిపేరీలో ఉంది. ఎక్స్‌కవే టర్లు మూడు ఉండగా ఒకటి రిపేరిలో ఉంది. ఒక హిటాచి ఉండగా దాని మరమ్మతుల కోసం గత సంవత్సరం డిసెంబరులో రూ.3,50,000 ఖర్చు పెట్టారు. ఎనిమిది టిప్పర్లలో ఒకటి రిపేరిలో ఉంది. డ్రోజర్ ఒక్కటి ఉంది. గల్పర్లు 2 ఉండగా ఒక్కటి రిపేరిలో ఉంది. మినీ ఎక్స్‌కవేటర్లు ఐదు ఉండగా రెండు మాత్రమే పని చేస్తున్నాయి. మిగిలిన మూడు మరమ్మతులతో షోరూంలో ఉన్నాయి. ఇలా ప్రతి వాహనంలో ఒక్కటి షోరూంకే పరిమితం కావడంతో చెత్త సేకరణ ఇబ్బందిగా మారింది.

బిల్లులు పెండింగ్ ఉన్నాయి

మరమ్మతుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని చెల్లించిన వెంటనే వాహనాలు బయటికి వస్తాయి. చెత్త సేకరణకు ఎలాంటి అడ్డంకులు ఉండవు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే అన్ని వాహనాలు వస్తాయి. **- కె.విశ్వేశ్వరరెడ్డి, ప్రజారోగ్య అధికారి.**

రూ.28 లక్షల పెండింగ్

నగరంలోని వివిధ రకాల షోరూంలో ఉన్న వాహనాల మరమ్మతులకు సుమారు రూ.28 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాహనాలన్నీ రిపేరీ అయ్యాయి. కేవలం బిల్లులు చెల్లించిన వెంటనే వాహనాలు బయటికి వస్తాయి. ఇటీవల మంత్రి టీజీ భరత్ వాహనాల మరమ్మతులపై ఉన్నతాధికారులతో ఆరా తీశారు. అయితే అన్ని వాహనాలు బయటనే ఉన్నాయని కొన్ని మాత్రమే షోరూంలో ఉన్నాయని అధికారులు చెప్పినట్లు తెలిసింది.



మరమ్మతులు చేస్తున్న మెకానిక్‌లు

రీసర్వే పకడ్బందీగా చేయాలి

- జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్



ఆవులపల్లె గ్రామంలో రీసర్వేను పరిశీలిస్తున్న నంద్యాల జేసీ విష్ణుచరణ్

చాగలమర్రి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ రీసర్వేను పక్కాగా నిర్వహించాలని మండల, గ్రామస్థాయిలో సర్వేయర్లు, వీఆర్వోలను జిల్లా జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. గురువారం మండలంలోని ఆవులపల్లె గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భూముల రికార్డులను, భూ కొలతలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లా డుతూ జిల్లాలోని 28 మండలాల్లో భూ రీసర్వే పనులు ప్రారం భించామని అన్నారు. మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజె క్టుగా ఎంపిక చేసి రీసర్వే చేస్తున్నామని అన్నారు. ఒక్కో గ్రామా నికి 7 బ్లాక్‌లుగా విభజించి రోజుకు 20 నుంచి 25 ఎకరాలు సర్వే చేసేలా ప్రణాళిక చేశామని అన్నారు. మండల సర్వేయ ర్‌తో పాటు గ్రామ సర్వేయర్లతో రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేసి రైతుల సమక్షంలో రోవర్‌తో భూ రీసర్వే చేస్తున్నామని అన్నారు. రైతులకు ముందుగానే నోటీసులు అందజేస్తామని అన్నారు. అందుబాటులో లేని రైతులకు ఫోన్ వాట్సాప్ ద్వారా తెలియజే స్తున్నామని అన్నారు. చాగలమర్రి మండలంలో నేలంపాడు, ఆవులపల్లె గ్రామాల్లో 1175 పట్టాభూములు, 170 ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించామని అన్నారు. సర్వే నంబర్‌ల ఆధారంగా భూములు కొలతలు తీస్తున్నామని అన్నారు. రైతు లకు ఎటువంటి నష్టం జరుగ కుండా ఉండేలా భూ కొలతలు తీస్తున్నారని తెలిపారు. గతంలో జరిగిన భూ రీసర్వేలో రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం తిరిగి ప్రత్యేకంగా స ర్వేను పకడ్బందీగా నిర్వహించా లని ఆదేశాలు రావడంతో తిరిగి గ్రామాల్లో భూ రీసర్వే పనులు జనవరి నుంచి ప్రారంభించామన్నారు. రెవెన్యూ సదస్సులు, భూ రీసర్వే గ్రామసభలు నిర్వహించి రైతుల నుంచి అర్జీలను స్వీక రించామన్నారు. వాటిని కూడా పరిష్కరిస్తామని అన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఆర్డీవో చల్లా విశ్వనాథ్, తహసీల్దార్ రవికుమార్, డీటీ విజయ్‌కుమార్, డిప్యూటీ సర్వేయర్ల ఇన్‌స్పెక్టర్ నీలకంఠం, మండల సర్వేయర్ మద్దిలేటి, ఆర్ఐ అబ్దుల్‌సత్తార్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, కార్యదర్శులు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల పట్టాల కొనుగోలుపై విచారణ

ప్రభుత్వం మంజూరు చేసిన పేదల ఇళ్ల పట్టాలను కొను గోలు చేసిన వాటిపై విచారణ చేపడతామని జాయింట్ కలె క్టర్ విష్ణుచరణ్ తెలిపారు. ఇళ్ల పట్టాలను కొనుగోలు చేసి ఉంటే వాటిని రద్దు చేస్తామన్నారు.

బ్రాహ్మణపల్లె వంతెన పనులు చేపట్టాలి

వక్కిలేరు వాగుపై వంతెన పనులు చేపట్టాలని ఆవులపల్లె, బ్రాహ్మణపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు జేసీ విష్ణుచరణ్‌కు గురువారం విన్నవించుకున్నారు. లో లెవెల్ వంతెన ఉండ టంతో ప్రతి ఏడాది వరద నీటితో రాకపోకలతో స్తంభించి ఇబ్బంది పడుతున్నామని అన్నారు.

మొక్క జొన్న పంటపై పందుల దాడి ..

- 11ఎకరాల్లో రూ.4లక్షల పంట నష్టం



పందుల దాడిలో దెబ్బతిన్న పంట

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమీ పంలోని మొక్క జొన్న పంటపై ఊర పందులు చిందులు తొక్కా యి. బుధవారం రాత్రి మొక్క జొన్న పంటపై దాడి చేసి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిం చాయి. కోత దశలో ఉన్న మొక్క జొన్న కంకులను పందు లు ఇష్టానుసారంగా తిన్నాయి. రైతులు పుట్లూరు చెన్నారెడ్డి, సాగర్‌రెడ్డి, శరత్‌కుమార్ రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి తదితరుల 11ఎకరాల్లో పంట దిగుబడి వచ్చే సమయంలో పందులు దాడి చేయడంతో రూ.4లక్షలకు పైగా నష్టం వాటిల్లింది.

పిడుగుపాటు మృతుల కుటుంబాలకు పరిహారం

- ఉప లోకాయుక్త రజని

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు మృతి చెందిన వారి కుటుంబాలు నష్టపరిహారాన్ని పొందవచ్చని రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని ప్రకటనలో తెలియజేశారు. బాధిత కుటుంబాలు రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా దరఖాస్తు చేసుకోవాలని, పరిహారం చెల్లింపులో జాప్యం జరిగితే బాధితులు నేరుగా లోకాయుక్తను ఆశ్రయించవచ్చునని ఆమె తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- మంత్రి లోకేశ్‌ను కలిసిన గోగిశెట్టి నరసింహారావు



ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాలను లోకేశ్‌కు చూపుతున్న నరసింహారావు

శిరివెళ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు కోరారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో గోగిశెట్టి నరసింహారావు గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. నంద్యాల, కర్నూలు జిల్లాల్లోని రాజకీయ పరిస్థితులపై మంత్రితో చర్చించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన పలు కథనాలు, అంశాలను లోకేశ్‌కు వివరించారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలని ఆయన కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్, పారదర్శక పాలనతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడంతో పాటు బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించినట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు తెలిపారు.

చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తేవాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారి భాస్కర్

గోనెగండ్ల, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కింద ఈ నెల 15వ తేది నుంచి జిల్లాలో అన్ని గ్రామ పంచాయతీలలో ఉన్న చెత్త సంపద కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకురావాలని డీపీవో భాస్కర్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. గురువారం గోనెగండ్లలోని చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఎంపీడీవో కార్యాల యంలో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని 484 పంచాయతీలలో 484 చెత్త సంపద కేంద్రాలు ఉన్నాయని, వీటి అన్నింటిని ఉపయోగంలోకి తీసుకువచ్చి వర్మికంపోస్టు ఎరువులా పంచాయతీలకు ఆదాయం తీసుకువచ్చేలా చర్యలు తీసుకో వాలని ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్‌ను ఈ నెల 15న కలెక్టర్ రంజిత్ బాషా గోనెగండ్లలో ప్రారంభిస్తారని తెలిపారు. పంచాయతీ పారిశుధ్య కార్మికులు గ్రామాలలోని ఇంటింటి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను సేకరించాలని అన్నారు. గ్రామాలలో మార్చి 31వ తేదిలోపు ఇండ్లు, కొళాయిలు, దుకాణాల పన్ను వందశాతం వసూలు చేయాలన్నారు. ఎంపీడీవో మణిమంజరి, ఈవోఆర్డీ అనంతశయన, గ్రామ మేజర్ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మలాంగ్‌బాషా, అనిల్, సుబాన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో అగ్ని ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలోని ప్రాంతీయ శిక్షణ కేంద్రం(పురుషులు)లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. వైద్య ఆరోగ్యశాఖకు చెందిన కాలం చెల్లిన 3 వాహనాలు, ఒక అంబులెన్స్ పూర్తిగా కాలిపో యాయి. 2018లో ఇమ్యూనైజేషన్ కార్యాలయ భవనంలో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు వాహనాలను ప్రాంతీయ శిక్షణ కేంద్రానికి తరలించారు. గతంలో కాలపరిమితి దాటిన వాహనాలు, వేలం వేసిన వాహనాలు కూడా ఇందులో కాలిపోవడం విశేషం. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో డీఎంహెచ్‌వో కార్యాలయం ఆవరణలో దట్టమైన పొగలు వ్యాపించడంతో ప్రజలు భారీగా ఇక్కడికి తరలివచ్చారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రం(పురుషులు) ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిమేల్ ట్రైనింగ్ సెంటరులో ఓ వ్యక్తి సిగరెట్ కాల్చి దాన్ని మేల్ ట్రైనింగ్ సెంటరులో వేయడం వల్ల అగ్ని ప్రమాదం జరిగిందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. అగ్ని ప్రమాదంపై డీఎంహెచ్‌వో డా.పి. శాంతికళ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్, వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అధికారికి ఫిర్యాదు చేశారు. మంటలను అగ్ని ప్రమాపక సిబ్బంది ఆర్పివేశారు.

కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ప్రసన్న కుమార్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కామన్ పీజీ సెట్‌ను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ పీజీ సెట్ల నిర్వహణ ఏ యూనివర్సిటీకి ఆ వర్సిటీ వారిగా పీజీ ప్రవేశాలు నిర్వహించేవారని, గత వైసీపీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా కరోనా సాకుతో ఉమ్మడి పీజీ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించడం ప్రారంభించిందన్నారు. ఉమ్మడి పీజీ ప్రవేశాలు నిర్వహించడం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో 30 నుంచి 40 శాతం అడ్మిషన్లు లేవని అన్నారు. కూటమి ప్రభుత్వం ఉమ్మడి పీజీ అడ్మిషన్లను రద్దు చేసి ఏ యూనివర్సిటీకి ఆ వర్సిటీకి ప్రవేశాలు నిర్వహించే విధంగా తీసుకుంటామని నాడు విద్యార్థులకు హామీ ఇచ్చారని, అయితే.. ఫిబ్రవరి 8న రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న వివిధ కోర్సులకు సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశారన్నారు. అందులో పీజీ సెట్ ఉమ్మడిగానే ఉందని వివరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు అబుబకర్, సాయి, ఉదయ్ పాల్గొన్నారు.

మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు



మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలో అవసర మైన చోట్ల మురుగు కాలువల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ మేనేజర్ చిన్నరాముడు అన్నారు. గురువారం నగర పాలక కార్యాలయంలో 29వ వార్డు వెంకటేశ్వర్ నగర్ సీపీఐ నాయకులు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డులోని ఆంజనేయ స్వామి గుడి వెళ్లే దారిలో డ్రైనేజీలు లేక మురుగునీరు రహదారిపైకి వస్తుందని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా చిన్నరాముడు మాట్లాడుతూ నగరంలో అవసరమై చోట్ల మురుగు కాలువల నిర్మాణానికి ఇప్పటికే ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసరావు, సులోచనమ్మ, పద్మ, జయలక్ష్మీ, రాజు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

27న కాల్వబుగ్గలో భజన పోటీలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 27న భ్రమరాంబ బుగ్గ రామేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, ఆకుల మహేష్ గురువారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే టీమ్ సభ్యులు రూ.400 ప్రవేశ రుసుం చెల్లించాలన్నారు. గెలుపొందిన టీమ్ సభ్యులకు మొదటి నుంచి 13 బహుమతులు వరుసగా రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.9వేలు, రూ.8వేలు, రూ.7వేలు, రూ.6వేలు, రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1,016 నగదును అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9000194078, 9985793992 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

దుకాణాల ఎదుట మట్టి తొలగింపు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని అశోక్‌నగర్ పంప్‌హౌస్ పక్కనే నిర్మిస్తున్న నగర పాలక దుకాణాల వద్ద మట్టిని తరలించడంలో కాంట్రాక్టర్ అలసత్వం వహిస్తున్నారని బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు మట్టికుప్పలను తొలగించారు. దుకాణాల నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్న మురుగు కాలువలు, ఫుట్‌పాత్‌లపై టన్నుల కొద్ది ఉన్న మట్టిని తొలగించలేదంటూ కథనంలో పేర్కొన్నారు. స్పందించిన ఎస్ఈ రాజశేఖర్ అధికారులకు ఆదేశాలు జారీ చేసి మట్టి తొలగింపు నకు చర్యలు తీసుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గూడూరు ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గూడూరు మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఎంపీపీ సునీత అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శివనాగ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ సమావేశానికి అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

నిరుపేదలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాయత్రీ ఎస్టేట్ గురుదత్త పాలి క్లినిక్‌లో సరోజినీ నాయుడు జయంతి సందర్భంగా సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం సరోజిని నాయుడు కృషి చేశారన్నారు. ఆమె కృషితోనే దేశంలో మహిళలకు ఓటు హక్కు కల్పించబడిందని వివరించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రం పరిశీలన

గూడూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహిళా రైతు లక్ష్మీదేవి సాగు చేసిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి సీఎస్ఏ సంస్థ చెందిన శాస్త్రవేత్తలు డా.రాజశేఖర్, డా.రాంప్రసాద్, ఉదయ్ గురువారం సందర్శించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్మీదేవి ఎకరా పొలంలో పకృతి వ్యవసాయం ద్వారా ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, పాలకూర, కాకర, బీర, దోస, ఉల్లి, బెండ, వంకాయ పంటలు ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడకుండా సాగు చేయడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా మహిళా రైతు లక్ష్మీదేవిని సీఎస్ఏ సంస్థ సభ్యులు సన్మానించారు. ఏపీసీఎన్ఎఫ్ బీపీఎం చంద్రశేఖర్, ఏఈవోలు లక్ష్మీనారాయణ, శ్రీవాణి, శేఖర్ పాల్గొన్నారు.



మహిళా రైతు లక్ష్మీదేవిని సన్మానిస్తున్న సీఎస్ఏ సంస్థ ప్రతినిధులు

మహాశివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

25 నుంచి మార్చి 2 వరకు కాల్వబుగ్గలో బ్రహ్మోత్సవాలు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయ ఈవో మద్దిలేటి, ఫెస్టివల్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, స్నానపు గదులు, పోలీసు ఔట్ పోస్టు, పార్కింగ్, ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నారు. అలాగే పెద్ద కోనేరు, చిన్న కోనేరులను శుభ్ర పరిచి బోర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ఫెస్టివల్ కమిటీ సభ్యుల సహకారంతో అన్ని ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఆలయం చుట్టుపక్క ఎక్సవేటర్లతో కంపచెట్లను, చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నారు. ఈ నెల 25 నుంచి మార్చి 2వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యులు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించడంతో ఆలయంలో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

బ్రహ్మోత్సవాల వివరాలివి.. ఈనెల 25న మంగళవారం బుగ్గ రామేశ్వరస్వామి కాల్వ గ్రామ వరప్రయాణం



కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయం

- 26న ధ్వజారోహణం, తెల్లవారుజామున కల్యాణం.
- 27న సింహవాహన సేవ, సాయంత్రం ప్రభోత్సవం
- 28న రథోత్సవం
- మార్చి 1న వసంతోత్సవం, సాయంత్రం పారువేట,
- మార్చి 2న ఉత్సవమూర్తులు కాల్వ గ్రామానికి తిరుగు ప్రయాణం

భక్తులకు వసతులు కల్పిస్తున్నాం



మహాశివరాత్రి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. ఆలయానికి వచ్చే భక్తుల కోసం తాగునీరు, స్నానపు గదులు ఏర్పాటు చేశాం.

\- కాటినేని నారాయణ, ఉత్సవ కమిటీ సభ్యుడు

మహా శివరాత్రి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నాం



మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఆలయ సమీపంలో చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రపరిచాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పిస్తున్నాం.

\- మద్దిలేటి, కాల్వబుగ్గ, ఈవో

ఇంటింటి సర్వేలో న్యాయాధికారి



ఇంటింటి సర్వే చేస్తున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కొత్తబస్టాండు సమీపంలోని ఇల్లూరు నగర్ నుంచి ఇందిరాగాంధీ నగర్ వరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువా రం ఇంటింటి సర్వే నిర్వహించారు. ఇళ్లలో ఎవరైనా బాలబాలికలు మానసిక వైకల్యంతోగాని, అంగవైకల్యంతోగాని ఉన్నట్లయితే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తాము ఈ సర్వేను నిర్వహిస్తున్నామనీ పారా లీగల్ వలంటీర్లు, న్యాయవాదులు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందాలు ఈ నెల 10 నుంచి 24వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి వివరాలు సేకరిస్తారని తెలిపారు. శారీరక, మానసిక, వినికిడి, గ్రహణమొర్రి సమస్యలతో బాధ పడుతున్న పిల్లలను గుర్తించి వారిని డీఈఐసీ సెంటర్ల ద్వారా ఉచితంగా చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.నిర్మల, పి.శివసుదర్శన్, రాయపాటి శ్రీనివాసులు, సౌమ్య పాల్గొన్నారు.

● **పట్టణ నిరాశ్రయుల వసతి గృహం తనిఖీ :** స్థానిక ఇందిరా గాంధీనగర్‌లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గురువారం తనిఖీ చేశారు. వసతి గృహానికి సంబంధించిన అందిస్తున్న సౌకర్యాలను, అక్కడి పరిస్థితులను ఆయన పరిశీలించారు.

పకడ్బందీగా సర్వే నిర్వహించాలి: ఆర్డీవో



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్ కుమార్

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో హౌసింగ్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. గురువారం ఓర్వకల్లులోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. అలాగే మండలంలో ఏపీఐఐసీ భూములు, వాటి వివరాలు అలాగే రీసర్వేపై తహసీల్దార్ విద్యాసా గర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆర్డీవో మాట్లా డుతూ భూముల రీసర్వే మీదివేముల గ్రామంలో జరుగుతుందని, రోజుకు ఒక టీమ్ 20 నుంచి 25 ఎకరాల వరకు సర్వే చేస్తున్నారని, రీసర్వేకు రైతులు సహకరించాలని కోరారు. మండలంలో ఏపీఐఐసీ భూములు ఎన్ని ఎకరాల్లో ఉంది. ఎంత మంది రైతులకు నష్టపరిహారం అందింది. ఎంత మందికి అందాల్సి ఉందనే దానిపై తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు.

లా కళాశాల విద్యార్థికి అభినందన

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీల్లో ప్రసూనా లా కాలేజీ విద్యార్థి ప్రదీప్ సాగర్ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని ఉపకులపతి ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ ఉపకులపతి చాంబర్లో రిజిస్ట్రార్ విజయకుమార్, ప్రసూన కళాశాల ప్రిన్సిపాల్ శివాజీరాజ్ విద్యార్థిని అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరులో జరిగిన విజ్ఞాన్ మహోత్సవంలో వివిధ పోటీలు నిర్వహించారు. అందులో ప్రదీప్ సాగర్ తైక్వాండో 54 కేజీల క్యాటగిరిలో గోల్డ్ మెడల్ సాధించారని అన్నారు.

సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద పందుల స్వైర విహారం



సిమెంటు డస్ట్‌బిన్ వద్ద పందులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్ద గురువారం మధ్యాహ్నం రోగులకు భోజనం పంపిణీ చేశారు. అక్కడ పందులు ఉండగానే అపరిశుభ్రత వాతావరణంలో రోగులకు భోజనాన్ని అందించారని కొందరు రోగులు అధికారులకు ఫిర్యాదు చేశారు. డైట్ సిబ్బంది భోజనం పంపిణీ చేసిన తర్వాత పందుల గుంపులు గుంపులుగా చేరి రోగులు, బంధువులను ఇబ్బందులకు గురి చేశాయి. ఏకంగా సిమెంటు డస్ట్‌బిన్ పైకి పందులు ఎక్కి ఆహార పదార్థాలను తినేశాయి. ఆసుపత్రి అధికారులు మాత్రం పందులు ఇక్కడ లేవని, చాలా తగ్గించామంటున్నారు.

చంద్రగిరి శ్రీనివాసులుకు అభినందన



చంద్రగిరి శ్రీనివాసులును అభినందిస్తున్న జనసేన నాయకులు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పోక్సో కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన జనసేన జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాసులు ఆ పార్టీ ప్రతినిధులు అభినందించారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని జనసేన పార్టీ కార్యా లయంలో చంద్రగిరి శ్రీనివాసులుకు పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానని అన్నారు. నాయకులు వీటీవీ సుబ్బయ్య, చింతా సురేష్, తోళ్ల మంజునాథ్ పాల్గొన్నారు.

రోగుల అవస్థలు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వీల్ చైర్లు, స్ట్రెచర్లు లేక రోగులు అవస్థలు పడ్డారు. నందవరం మండలం బాపురం గ్రామానికి చెందిన చిరంజీవి కాలుకి కట్టుకట్టించుకోవడానికి రాగా, అక్కడ స్ట్రెచర్ లేకపోవడంతో బంధువు లు మోసుకుని వెళ్లారు. అదేవిధంగా ఓపీ కౌంటరులో గురువారం ఉదయం సర్వర్ నెట్ రాకపోవడం ఓపీ చీటిల పంపిణీకి అంతరా యం కలిగింది.



రోగిని మోసుకొని వస్తున్న బంధువులు

ఘనంగా సరోజిని నాయుడు జయంతి





జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సరోజిని నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉద్యోగులు, క్లస్టర్ యూనివర్సిటీలో..

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమ నాయకురాలు సరోజిని నాయుడు 146వ జయంతిని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి హాజరై సరోజిని నాయుడు చేసిన సేవలను కొనియా డారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఉప గ్రంథాలయ అధికారి వి.పెద్దక్క, లైబ్రేరియన్లు బాషా, వజ్రాల గోవిందరెడ్డి పాల్గొన్నారు.

కర్నూలు అర్బన్: స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని మహిళలకు ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా సమాన హక్కులు ఉండాలని సరోజిని నాయుడు నొక్కి చెప్పారని ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయి గోపాల్ అన్నారు. గురువారం క్లస్టర్ యూనివర్సిటీలో సరోజిని నాయుడు జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు, డీన్‌లు అక్తర్ భాను, నాగరాజుశెట్టి, పరీక్షల విభాగం కంట్రోలర్ కె.బాలసుబ్రహ్మణ్యం, అధ్యాపకులు మహబూబ్ బాషా, మహమ్మద్ వాహిద్, షామీద బేగం, సవిత, చక్ర, అరుణ కుమారి, స్వప్న పాల్గొన్నారు.

రిపోర్టుల కోసం నిరీక్షణ

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో పరీక్షల రిపోర్టుల కోసం రోగు లు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఉదయం 9గంటలకు వచ్చిన రోగులకు వైద్యులు పరీక్షలు రాసి న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు పంపుతారు. ఇక్కడ ఎక్కడా 24 నెంబరు, 33 నెంబర్ ఎక్కడ ఉందో సూచికలు గానీ, బోర్డులు గానీ లేకపోవడంతో గందరగోళం పరిస్థితి నెలకొంది. న్యూడయో గ్నస్టిక్ బ్లాకులో రోగులు పరీక్షల కోసం గంటల తరబడి వేచి చూస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షల కోసం వెళితే మొదటి అంతస్థు ఉన్నట్లు నెంబరు వేస్తారు. పైకి వెళ్లిన రోగులను తిరిగి గ్రౌండు ఫ్లోర్‌లో శాంపుల్ కలెక్షన్ కోసం పంపుతున్నా రన్నారు. ఉదయం జరిగిన పరీక్షల నివేదికలు (రిపోర్టులు) సాయంత్రం 3.40 గంటలైనా గురువారం ఎవరూ సిబ్బంది రాలేదని, దీంతో ప్రజలు పెద్ద ఎత్తున రిపోర్టు కౌంటర్ వద్ద బారులు తీరారన్నారు. రిపోర్టులు కూడా ఒక రోగి పేరు చదివితే వారికి వినిపించక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాయంత్రం 3.40 గంటలకు రిపోర్టులు ఇవ్వడం ప్రారంభిస్తే.. 4.40 గంటల వరకు వీటిని ఇవ్వడానికి సమయం పట్టిందని తీరా వైద్యులు ఆ సమయంలో లేకపోవడంతో వెనుదిరిగినట్లు తెలిపారు. రిపోర్టులను సెల్‌ఫోన్లకు వాట్సాప్ చేసే విధానం తేవాలని అధికారులను కోరుతున్నారు.



రిపోర్టుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ పరిధిలోని 16 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. గురువారం నగరంలోని 19వ వార్డు గౌతమి నగర్‌లో రూ.24 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మేయర్ బీవై రామయ్యతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ కల్లూరు అర్బన్‌లోని శివారు ప్రాంత సమస్య లపై దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల ఇన్‌చార్జి పెరుగు పురుషోత్తంరెడ్డి, 19వ వార్డు ఇన్‌చార్జి ప్రభాకర్ యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ శేషసాయి, డీఈఈ నరేష్, ఏఈ భార్గవి పాల్గొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి: సీపీఎం



మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఇళ్ల స్థలాల కోసం వెళ్లిన పేదలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీపీ ఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నూలు మండలంలోని బి.తాండ్రపాడు గ్రామ పరిధి సర్వే నెంబరు 330,344లో 18 ఎకరాల భూమిలో ఇళ్లులేని పేదలు కొట్టాలు వేసుకుంటుంటే వారిపై దాడి చేయడం అమానుషమన్నారు. దాడికి గురై ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో బాధితులు చికిత్స పొందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే ఎన్నికల ముందు ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి హుసేనయ్య, రాఘవేంద్ర, ఎన్‌జీ కృష్ణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెల 3వ శనివారం పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ కార్యాలయాల పరిధిలోని లోపల, బయటి పరిసరాలను శుభ్రంగా చేసుకోవ డం, పిచ్చిమొక్కలను తొలిగించడం, మరుగుదొడ్లను శుభ్రం చేయించ డం, ప్రతి మరుగుదొడ్డికి రన్నింగ్ వాటర్‌ను ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. క్లాప్‌మిత్రలు ఇళ్లు, షాపుల వద్ద పాఠశాలల పరిధిలో చెత్తను మూడు రకాలుగా వేరు చేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం పాఠశాలల స్థాయిలో విద్యార్థులతో ర్యాలీలు నిర్వహించి స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలపై వ్యాస రచన, వకృత్వ పోటీలను విద్యార్థులకు నిర్వహిం చాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు జీపీ సుధమోహన్ జనసేన పార్టీలో చేరారు. గురువారం స్థానిక బిర్లా కాంపౌండులోని పార్టీ కార్యా లయంలో జనసేన నాయకులు చింతా సురేష్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీపీ సుధమోహన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలతో పాటు, జనసేన పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితున్నై అందులో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడతల సుధాకర్ పాల్గొన్నారు.

మహేష్‌కు సన్మానం

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): హాకీ ఆలిండియా సివిల్ సర్వీసెస్‌కు ఏపీ జట్టు తరఫున కొంగనపాడు సచివాలయం అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ కురువ మహేష్ ఎంపికయ్యారని న్యాయవాది, క్రీడా దాత జి.శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక డీఎస్ఏ అవుట్ డోర్ స్టేడియంలో న్యాయవాది శ్రీధర్ రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు మహేష్‌ను అభినందించి సన్మానించారు. మహేశ్వరరావు, చిన్న సుంకన్న, శేషఫణి పాల్గొన్నారు.



మహేష్‌ను సన్మానిస్తున్న క్రీడా ప్రతినిధులు


శిథిలావస్థలో టిడ్కో గృహాలు



టిడ్కో ఇళ్ల చుట్టూ పెరిగిన ముళ్లకంప

సదుపాయాలు కల్పిస్తే ఉపయోగం

ఇప్పటికే పనులు పూర్తయిన కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు చేరేందుకు సిద్ధంగా లేరు. తాగునీరు, విద్యుత్, సెక్యూరిటీ, పారిశుధ్య నిర్వహణ ఉంటే లబ్ధిదారులు చేరే అవకాశముంది. రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన గృహాలు ఇలా నిరుపయోగంగా ఉండటంపై లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు. ఓహెచ్ఆర్ ట్యాంకును అసంపూర్తిగా వదిలేశారు.



అసంపూర్తిగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు

- కనీస వసతులు లేకపోవడంతో ఇళ్లలో చేరని లబ్ధిదారులు
- పిచ్చిమొక్కలతో నిండిన గృహాలు

ఆదోని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని శివారులోని శిరుగుప్ప రోడ్డులో టీడీపీ ప్రభుత్వం 4,704 ఇళ్లు నిర్మించింది. షేర్‌వాల్ సాంకేతిక పరిజ్ఞానంతో రూ.కోట్లు ఖర్చు చేసింది. దాదాపు 80శాతం పనులు పూర్తయ్యాయి. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం 1,632 మంది లబ్దిదారులకు తాళాలు ఇచ్చింది. కానీ కనీస వసతులు లేక ఇళ్లలో చేరేందుకు లబ్దిదారులు ఆసక్తి చూపడం లేదు.

80 శాతం పనులు పూర్తి

2014 నుంచి 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను నిర్మించి, దాదాపు 80శాతం పనులు పూర్తి చేసింది. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో లబ్ధిదారులు నిరాశ చెందుతున్నారు.

పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని ఆరోపణలు ఉన్నాయి. టీడీపీకి పేరు వస్తుందన్న కక్షతో పక్కన పెట్టిందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ సముదాయాల నిర్వహణ గాలికి వదిలేయడంతో గృహాలు శిథిలావస్థకు చేరాయి.

ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్ల కంప

టిడ్కో గృహాల నిర్వహణ సరిగా లేకపోవడంతో ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు, ముళలకంప పెరిగిపోయాయి. చాలా గృహాల్లోని కిటికీల అద్దాలు ఊడిపోయి, తలుపులు చెదలు పట్టి విరిగిపోయాయి. పిచ్చి మొక్కలు పెరగడంతో విష పురుగులు, పాములకు ఆవాసాలయ్యాయి.

చేరేందుకు లబ్ధిదారుల వెనకడుగు..

పట్టణానికి దూరంగా ఉండటం, రవాణా ఖర్చులు పెరిగిపోతుండటంతో ఇళ్లలో నివసించేందుకు పేదలు ఆందోళన చెందుతున్నారు. 1,632 ఇళ్లు అప్పగించినా ఎవరూ ముందుకు రాలేదు. కనీస వసతులు కల్పిస్తేతప్ప ఇళ్లలోకి చేరలేమంటూ లబ్ధిదారులు ఎమ్మెల్యే పార్థసారధికి తేల్చి చెప్పారు.

'ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు సురక్షితం'

తుగ్గలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవాలు చేయించుకుంటేనే సురక్షితమని వైద్యాధికారి హరిత అన్నారు. గురువారం పగిడిరాయి వైద్యశాలలో గర్భిణులు, బాలింతలకు వైద్యసేవలు అందించారు. గర్భిణులు, బాలింతలు ప్రతి నెలా వైద్యపరీక్షలు చేయించుకోవాలని, మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కూడా వైద్యశాలలోనే వైద్యసేవలు, మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు.

ఆస్తి పన్ను వసూళ్లపై ఫేక్ కాల్స్

ఆదోని టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఆస్తి, తాగునీటి చార్జీలు, ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లపై ఫేక్‌కాల్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. గురువారం మాట్లాడుతూ బకాయిల విషయంలో సచివాలయ సిబ్బంది నేరుగా యజమానులతో మాట్లాడతారని, ఫోన్‌చేసి, డబ్బు వసూలు చేయడం జరగదన్నారు. ఫోన్ నెంబర్ 6300805117 నుంచి కొందరు ఫోన్ చేసి ఫోన్‌పేలో బకాయిలు చెల్లించాలని అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, ప్రజలు కార్యాలయంలో చెల్లించి రసీదు తీసుకోవాలని తెలిపారు.

జాతీయ రహదారిని పూర్తి చేయాలి



నిరసన తెలుపుతున్న వాహనదారులు, నాయకులు

ఆలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా ఉన్న జాతీయ రహదారిని పూర్తి చేయాలని వాహనదారులు, వ్యాపారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. పనులు పూర్తికాకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, దుమ్ముతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రామాంజినేయులు, రంగన్న పాల్గొన్నారు.

పాలక వర్గం ఎన్నికలు జరిపించాలి

ఆదోని టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని షాహి జామియా మసీదు పాలక వర్గ ఎన్నికలను వెంటనే జరిపించాలని మైనార్టీ పరిరక్షణ సమితి కార్యదర్శి నుర్‌అహ్మద్ డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ, ఐదుగురు సభ్యులలో ముగ్గురు చనిపోగా, ఒకే వ్యక్తి పదేళ్లుగా ముతవల్లి స్థానంలో చలామణి కావడం సరికాదన్నారు. మైనార్టీల అభివృద్ధిని కోరే సీఎం చంద్రబాబు ఎన్నికలను జరిపించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ భరద్వాజ్‌కు వినతిపత్రం ఇచ్చారు.



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రైల్వే అండర్ పాస్‌కు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

ఆదోని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మేదరిగేరి నల్లగేటు వద్ద రైల్వే అండర్ పాస్ నిర్మాణానికి రైల్వే శాఖ అసిస్టెంట్ డివిజన్ ఇంజనీర్ సిరాజ్ అహ్మద్, పురపాలక శాఖ స్థలాన్ని పరిశీలించారు. వారం క్రితం ఎమ్మెల్యే పార్థసారధి సౌత్ సెంట్రల్ రైల్వే జీఎంను కోరారన్నారు. ఈ మేరకు సర్వే చేస్తున్నామని తెలిపారు. ఇంజనీర్లు తేజేశ్వర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటేశ్వర్లు, బీజేపీ కోకన్వీనర్ నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



కర పత్రాలు విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్, అధికారులు

ఆదోని, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని, ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. గురువారం కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, విద్య, వైద్యం, పోలీసుల అధికారులు,తో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలను అరికట్టడం ఏ ఒక్క శాఖ బాధ్యత కాదని, అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పెద్దలు సమష్టిగా పనిచేస్తేనే సాధ్యమవుతుందని తెలిపారు. 18 సం. లోపు బాలికలను ఇబ్బంది పెడితే కేసు నమోదు చేస్తామని అబ్బాయిల జీవితాలు నాశనమవుతాయన్నారు. ఆడపిల్లల ను చదివించి, వారికి నైపుణ్యాలను నేర్పించి, మనోధైర్యాన్ని నింపాలన్నారు. పీడీ నిర్మల, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, సీడీపీవోలు ఉమామహేశ్వరి, సఫీరున్నీసాబేగం, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అడవుల రక్షణ మనందరి బాధ్యత

- జిల్లా అటవీశాఖ అధికారి విజయ్ కుమార్



మాట్లాడుతున్న అటవీశాఖ అధికారి విజయ్ కుమార్

వెల్దుర్తి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అడవులను రక్షించుకోవడం మన బాధ్యత అని జిల్లా అటవీశాఖ అధికారి విజయ్ కుమార్ అన్నారు. గురువారం రామళ్లకోట గ్రామం జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవకోటికి ప్రాణ వాయువు చెట్లనే ద్వారానే అందుతోందన్నారు. చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తుండడంతో ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. వేసవిలో అడవులు కార్చిచ్చుకు గురై వన్యప్రాణాలు, చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అడవులకు, పర్యావరణానికి హానిచేసే వారి సమాచారం ఇవ్వాలని విద్యార్థులను కోరారు. అనంతరం విద్యార్థులతో పాఠశాల నుంచి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఓబులేశు, శకుంతల, రేణుక, రామచంద్రుడు పాల్గొన్నారు.

గరుసు తరలిస్తే చర్యలు

ఆలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మైనర్ ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా మట్టి తరలిస్తే కేసు నమోదు చేయిస్తామని తహసీల్దార్ గోవింద్ సింగ్ హెచ్చరించారు. గురువారం అగ్రహారం కొండల్లో బోర్డు ఏర్పాటు చేశారు. సర్వే నెం.16లో మట్టి తరలింపుపై నిషేధం విధించినట్లు తెలిపారు. అమర్నాథ్ రెడ్డి, రవి కుమార్ ఉన్నారు.

బండలాగుడు విజేతగా రాయవరం ఎడ్లు



నగదు అందజేస్తున్న నిర్వాహకులు

క్రిష్ణగిరి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉరుసు సందర్భంగా గురువారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో రాయవరంకు చెందిన రామచంద్రారెడ్డి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. పిన్నాపురం గ్రామానికి చెందిన వెంకట కృష్ణయ్య వృషబాలు ద్వితీయ స్థానం, బి.తాండ్రపాడుకు చెందిన చిన్నరత్నం ఎడ్లు తృతీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు.

హుండీ లెక్కింపు

దేవనకొండ,ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌలుట్ల చెన్నకేశవస్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. హుండీలో రూ.2.78లక్షలు, టికెట్ల ద్వారా రూ.56 వేలు వచ్చినట్లు ఆలయ అధికారి వీరయ్య తెలిపారు.

టీడీపీతోనే యువత అభివృద్ధి

తుగ్గలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే యువత అభివృద్ధి చెందుతారని తెలుగు యువత మండల అధ్యక్షుడు సత్యప్రకాష్, బలరాముడు, మల్లికార్జున, రంగస్వామి అన్నారు. గురువారం గిరిగిట్లలో మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. టీడీపీ వచ్చిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇస్తున్నారన్నారు.

రుణాలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు

తుగ్గలి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): రుణాలు చెల్లించకపోతే ఆస్తులు జప్తు చేస్తామని ఉప్పర్లపల్లి సొసైటీ సీఈవో గిడ్డయ్య హెచ్చరించారు. గురువారం మండలంలోని జొన్నగిరి సొసైటీలో రైతులతో మాట్లాడారు. రుణాలను చెల్లించాలని లేకుంటే ఏటా వడ్డీ చెల్లించి రెన్యువల్ అయినా చేసుకోవాలన్నారు. వడ్డీ చెల్లించకుంటే మొండి బకాయిల కింద రుణగ్రహీత ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, వేలం వేస్తుందన్నారు. క్లర్క్ నాగరాజు ఉన్నారు.

ఉద్యాన పంటలతో లాభం



బొప్పాయి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): ఉద్యాన పంటలతో అధిక లాభం పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ మౌనిక సూచించారు. గురువారం ఢణాపురం, పెద తుంబళం గ్రామాల్లో ఉద్యాన అధికారులతో బొప్పాయి, కూరగాయల పంటలను పరిశీలించారు. వ్యవసాయ అధికారుల సలహాలను పాటించాలని సూచించారు. హరేంద్ర, రామకృష్ణ, గురుహరి, పార్వతిబాయి పాల్గొన్నారు.

సమావేశం సమయాన్ని మార్చాలి



మాట్లాడుతున్న వీరచంద్ర యాదవ్

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న పాఠశాల సముదాయాల సమావేశ వేళను మార్చాలని ఎస్టీయూ పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఉదయం 11:45 వరకు పాఠశాలల్లో పాఠాలు బోధించి 20 కి.మీ. దూరంగా ఉన్న క్లస్టర్ పాఠశాలలో మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశాలకు హాజరు కావాలని చెప్పడం హాస్యాస్పదమన్నారు. భోజనానికి సమయం ఇవ్వకుండా సమావేశాలకు హాజరుకావాలని తొందర పెట్టడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణ ప్రధాన కార్యదర్శి అధ్యక్షుడు భీమరాజు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు బకాయిలను చెల్లించాలని కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వీరశేఖర్, నారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో కార్యాలయం వద్ద తట్ట, చెలిక, పారతో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పించి రోజుకు రూ.500లు వేతనం ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో మరణిస్తే రూ.5లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్డీవో, సూపరింటెండెంట్లకు వినతి పత్రం అందజేశారు.

మార్చి 12న ఛలో అసెంబ్లీ

జాతీయ ఉపాధి హామీ పథకం పట్ల ప్రభుత్వాల వైఖరిని నిరసిస్తూ మార్చి 12వ తేదీన ఛలో అసెంబ్లీ నిర్వహిస్తున్నామని వ్యవసాయ సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉపాధి హామీ నిధులకు కోత పెడుతున్నారని మండిపడ్డారు. రూ.లక్ష కోట్లు కేటాయించాలని, అడిగినవారందరికీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. వీరశేఖర్, నారాయణ, లింగన్న, బాలకృష్ణ, దస్తగిరి పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు న్యాక్ ఇన్‌చార్జి ఉలుగన్న, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ పదోతరగతి ఆపై చదివిన వారికి 90 రోజులపాటు శిక్షణ ఇచ్చి, అనంతరం ఉపాధి చూపుతామని తెలిపారు. 18ఏళ్ల నుంచి 35ఏళ్లలోపు వారు ఆర్ట్స్ కళాశాల రహదారిలోని ఎంపీయూపీ పాఠశాలలో ఉనన న్యాక్ శిక్షణ కేంద్రంలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు వీరేష్ 939703148, రాజశేఖర్ 988585187ను సంప్రదించవచ్చన్నారు.

అన్నదానం గొప్పది

మద్దికెర, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని మాజీ జడ్పీటీసీ సభ్యులు పి. పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్ అన్నారు. గురువారం గ్రామంలోని మద్దమ్మ ఆలయంలో టీడీపీ నాయకులు, పంచాయితీ సభ్యులు జంబునాథ్‌రాయుడు, సంధ్యారాణి, ఉమామహేశ్వరి, శ్రీనివాసులు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని వారు ప్రారంభించారు.



భక్తులకు అన్నం వడ్డిస్తున్న నిర్వాహకులు

16 నుంచి పాదయాత్రికులకు అన్నదానం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 13 (ఆంధ్ర జ్యోతి): శ్రీశైలానికి వెళ్లే పాద యాత్రికులకు ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు అన్నదానం చేస్తున్నట్లు మహర్షి విజయ్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. ఎమ్మిగనూరు బైపాస్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు ఉదయం 5 గంటల నుంచి రాత్రి వరకు భోజనం పెడతామన్నారు.

నేటి నుంచి ఉరుసు

ఆస్పరి , ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ములుగుందం గ్రామంలో దస్తగిరయ్య ఉరుసు శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 14న గంధం, 15వ ఉరుసు, 16న జీఆర్ఎత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, వెంకటరెడ్డి, నర్సిరెడ్డి తెలిపారు.



అడ్డంగా నరికేస్తున్నారు

అక్రమార్కులు చెట్లను అడ్డగా నరికేస్తున్నారు. అడిగేవారు లేకపోవడంతో వారు ఆడిందే ఆట.. పాడిందే పాటగా సాగుతోంది. దేవనకొండ-కర్నూలు రహదారిపై చెట్లను నరికేస్తుండటంతో పర్యావరణ ప్రేమికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ విద్యుత్ కాంట్రాక్టర్లు ఇలా చేస్తున్నారని, చెట్లకు నష్టం కలగకుండా పనులు చేయాలంటున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
- దేవనకొండ

గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- అరికెర గురుకులం ప్రిన్సిపాల్ మనోరాజు



ఆలూరు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు అరికెర గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపాల్ మనోరాజు అన్నారు.

ప్రశ్న: అరికెర గురుకులంలో 5, ఇంటర్మీడియట్ ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైందా?

జవాబు: 2024-25 విద్యా సంవత్సరానికి గురుకులంలో ప్రవేశానికి నోటిఫికేషణ్ ఇచ్చాము. వచ్చేనెల 6వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

ప్రశ్న: ఇంటర్మీడియట్ కోర్సులు వివరాలు?

జవాబు: సీఈసీ, ఎంఈసీ గ్రూప్‌లు మాత్రమే ఉన్నాయి. వీటికి మాత్రమే దరఖాస్తు చేయాలి.

ప్రశ్న: దరఖాస్తు ఎలా చేసుకోవాలి?

జవాబు: ఏపీబీఆర్‌జీసీఈటీ. ఏపీసీఎఫ్ ఎస్ఎస్.ఇన్.లో దరఖాస్తు చేయాలి. వారు సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామం. రూల్ ఆఫ్ రిజర్వేషన్ కూడా ఉంటుంది.

ప్రశ్న: గురుకులంలో ప్రవేశాలకు అవగాహన కల్పిస్తున్నారా?

జవాబు: గ్రామాల్లో కరపత్రాలతో విసృతంగా ప్రచారం చేస్తున్నాం.

ప్రశ్న: ప్రవేశ పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారు?

జవాబు: 5వ తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 6వ తేదీన ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశానికి మధ్యహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఎరీక్ష ఉంటుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

సీసీ కెమెరాలను ప్రారంభించిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మండలంలోని బనవాసి బాలికల గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తిక్కారెడి మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కాదన్నారు. ప్రస్తుతం విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తోందని, బాగా చదువుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ సామ్రాజ్యం మాట్లాడుతూ మెగా పేరెంట్స్‌డే సందర్భంగా బాలికల భద్రత కోసం తాను సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తానని ఇచ్చిన హామీని తిక్కారెడ్డి నెరవేర్చడం అభినందనీయమన్నారు. పాఠశాలలో మొత్తం 16 సీసీ కెమెరాలను ఏర్పాటుకు కృషి చేసిన తిక్కారెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, శ్రీనివాసయాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం



సరోజిని నాయుడు చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజినీ నాయుడు జయంతిని రావూస్ డిగ్రీ కళాశాల పిన్సిపాల్ వేంకటేశ్వర్లు, అధ్యాపకులు, సిబ్బంది ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల సీవవో సుజనారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి వరకు గడువు

నందవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం శనివారం వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలన్నారు. అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

'నమోదు చేసుకోవాలి'

నందవరం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): విశిష్ట సంఖ్య ప్రతి రైతు నమోదు చేసుకోవాలని ఏవో స్రవంతి సూచించారు. గురువారం ఆమె మాట్లాడుతూ మీ సేవ కేంద్రాల్లో గానీ, రైతు సేవా కేంద్రాల్లో పాసు బుక్ జిరాక్స్, 1బి, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింకైన ఫోన్ నెంబర్ తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని చెప్పారు.

నేడు కంటి వైద్య శిబిరం

కోసిగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని మార్కండేయ స్వామి కళ్యాణ మండపంలో ఆర్‌కే కంటి వైద్యశాల ఎమ్మిగనూరు వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డా.హేమంత్ కుమార్ తెలిపారు. ఉచిత కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆర్‌కే కంటి ఆసుపత్రి ఎమ్మిగనూరులో ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు డా.హేమంత్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చేయనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలకు వచ్చేవారు ఆధార్, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ కార్డు తీసుకురావాలని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జార్ఖండ్ వాసి గాయపడ్డారు. వివరాలివీ.. మండలంలోని బనవాసి గ్రామంలో విద్యుత్‌లైన్‌ను ఏర్పాటు చేసేందుకు జార్ఖండ్ నుంచి కొంతమంది బనవాసికి వచ్చారు. విద్యుత్ స్తంభాలకు విద్యుత్ వైర్లను ఏర్పాటు చేసి విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. అయితే గురువారం జార్ఖండ్‌కు చెందిన సందీప్‌ఇన్వర్ విద్యుత్ స్తంభాన్ని ఎక్కిన సమయంలో ప్రమాదానికి గురై స్తంభంపై నుంచి కిందపడ్డాడు. దీన్ని గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విద్యుత్ ఏఈ గురుమూర్తిని వివరణ కోరగా.. ఎల్‌సీ తీసుకున్న పోల్ బదులుగా మరో పోల్ ఎక్కడంతో ప్రమాదం జరిగిందని చెప్పారు.

రాఘవరాయలకు విశేష పుష్పాలంకరణ

- వెండి గజ వాహనంపై విహరించిన ప్రహ్లాదరాయలు
- భక్తులతో కిక్కిరిసిన శ్రీమఠం

మంత్రాలయం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ సేవ చేశారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాదిపొందిన గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టువస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. పీఠాధిపతి సంస్థాన పూజ చేశారు. హస్తోదకం చేసి మహా మంగళ హారతులు చేశారు. రాఘవరాయలకు ఇష్టమైన మాఘ మాస గురువారం కావటంతో దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వే లాదిగా భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిరిసింది.

● మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి గజవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. మాఘ పాడ్యమి గురువారం శుభదినం పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి, మంచాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళ వాయిద్యాల మధ్య వెండి గజవాహనంపై స్వర్ణ అంబారిలో వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్ఠించి పీఠాధిపతి మహామంగళహారతితో ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు.



వెండి గజవాహనంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

'అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు'

మంత్రాలయం, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరిగే బంగారమ్మ గ్రామ దేవర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రాలయం సీఐ రామాంజులు, మాధవరం ఎస్ఐ విజయకుమర్ హెచ్చరించారు. గురువారం రాత్రి బంగారమ్మ దేవత ఆలయ ఆవరణంలో గ్రామ దేవర కమిటీ పెద్దలు, మేటీ పెద్దలు, గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఘర్షణలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదన్నారు. అన్ని కులాలు ఐక్యతగా జరుపుకున్నప్పుడే విజయవంతం అవుతుందన్నారు. గ్రామంలో 20న ఏర్పాటు చేసిన వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర పౌరాణిక నాటకం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో రఘు, వీరేష్, భాస్కర్, జెట్టి నరసింహులు, కోసిగి హనుమంతు, వీరేష్, రోగెప్ప, మజ్జిగ బొజ్జప్ప, యాగంటి వీరేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కోసిగి, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త దేవన్నగారి మునయ్య బుధవారం మృతి చెందారు. టీడీపీ గ్రామ నాయకులు రంగారెడ్డి, గోపాల్ ద్వారా విషయం తెలుసుకున్న టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి కార్తకర్త కుటుంబానికి మట్టి ఖర్చుల నిమ్మితం రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఈ నగదును టీడీపీ నాయకుడు ఉప్పలపాటి అర్జున్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. నాయకులు రామాంజి, నర్సారెడ్డి, శ్యాంసుందర్, రాఘవేంద్రలు ఉన్నారు.

ఆకతాయిలకు పోలీసుల కౌన్సెలింగ్



ఆకతాయిలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలోని జూనియర్ కళాశాల దగ్గర గురువారం అనవసరంగా తిరుగుతూ వెకిలి చేష్టలు చేస్తున్న ఇద్దరి యువకులను పోలీసులు అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ గంగాధర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల వద్ద విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేసే ఆకతాయిలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులను వేధిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే స్కూల్స్, కాలేజీల వద్ద ఎక్కువ శబ్దం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యార్థిని ప్రతిభ



ప్రశంసా పత్రం అందుకుంటున్న జోష్ణవి

నందవరం, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేషనల్ ఏపీఫనీ మోడల్ టెస్ట్ (ఈఈఎంటీ)-2025 పరీక్షలో నందవరం మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న జోష్ణవి ప్రతిభ కనబరిచి జిల్లాలో మూడో స్థానంలో నిలిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తెలిపారు. విద్యార్థినికి విజయవాడ మాకినేని బసవ పున్నయ్య సెంటర్ నిర్వాహకులు రూ.3 వేలు నగదు, ప్రశంసా పత్రం అందజేశారని తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మందకృష్ణను కలిసిన టీడీపీ నాయకుడు



మందకృష్ణతో ఆదెన్న

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు చెందిన టీడీపీ నాయకుడు కదిరికోట ఆదెన్న హైదరాబాద్‌లోని మంద కృష్ణ మాదిగను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదెన్న రచించిన దళితుల ఆశాజ్యోతి మాజీ భారత ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జీవిత చరిత్రతో కూడిన సమతా యోధుడు పుస్తకాన్ని అందజేశారు. డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి రిజర్వేషన్లలో ఏబీసీడీ వర్గీకరణ ద్వారానే మాదిగలకు దాని ఉప కులాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఏపీలో బేడ, బుడగ జంగాలకు అడ్డుగా ఉన్న జీవో 144 రద్దుకు కృషి చేయాలని మందకృష్ణను కోరారు. కార్యక్రమంలో ఆనంద్, చైతన్య, మహదేవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పడ్డ గంజహళ్లి రహదారి



గుంతలు పడ్డ గంజహళ్లి- బైలుప్పల రహదారి

గోనెగండ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంజహళ్లి, బైలుప్పల, బీ అగ్రహారం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. దీంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు, ఆటోలు గుంతలలో పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇదే రహదారి వెంట గోనెగండ్ల నుంచి గంజహళ్లి, బైలుప్పల, అగ్రహారం, తెర్నెకల్లు గ్రామాలకు బస్సులు, ఆటోలు వెళ్తుంటాయి. గంతలు పడిన రోడ్డును బాగు చేయాలని ఆయా గామాలవారు వేడుకుంటున్నారు. రహదారిని బాగుచేయాలని పలు మార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికి ఫలితం లేకుండా పోయిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కుక్కల వీరంగం

- గోనెగండ్లలో మూడు రోజుల్లో 20 మందిపై దాడి
- భయాందోళనలో ప్రజలు

గోనెగండ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లోని వీధుల్లో కుక్కలు వీరంగం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా జయరాముడు, ఎలియా, రామిరెడ్డి, మల్లేష్‌లతో పాటు మరో 20 మందిపై కుక్కలు దాడి చేసి గాయ పరిచాయి. ఇందులో కొందరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా మిగిలినవారు నాటు వైద్యం చేయించుకున్నారు. ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెల 13 రోజులకు గాను మండలంలోని పలు గ్రామాలలో 200 మంది పై కుక్కలు దాడులు చేశాయి. అందులో 72 మంది ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. గత మూడు మాసాలుగా మండల వ్యాప్తంగా 800 మందిపై కుక్కలు దాడులు చేసి గాయ పరచినట్లు ఆసుపత్రి లెక్కలు చెపుతున్నాయి. అయితే ప్రైవేట్‌గా చికిత్స చేయించుకున్న వారి మరో 1800 పైగా ఉన్నట్లు తెలుస్తోంది. మండలంలోని గోనెగండ్ల, వేముగోడు, తిప్పనూరు, కున్నూరు, అలువాల, కులుమాల, హెచ్. కైరవాడి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో కుక్కలు అధిక సంఖ్యలో సంచరిస్తున్నాయి. జనసంచారం అధికంగా ఉన్న సెంటర్ల దగ్గర, మటన్, చికెన్ దుకాణాల దగ్గర కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. అటువైపు వెళ్లాలంటే పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుక్కల దాడులకు గురికాకుండా పంచాయతీ సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



సంత మార్కెట్‌లో సంచరిస్తున్న కుక్కలు

'వ్యాధులు ప్రబలకుండా చర్యలు'



వీధుల్లో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లుతున్న పంచాయతీ సిబ్బంది

గోనెగండ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): అంటువ్యాధులు సోకకుండా ఉండేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నట్లు మేజర్ పంచాయతీ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యదర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్ తెలిపారు. గోనెగండ్లలోని పలు వీధుల్లో పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను గురవారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అంటువాధ్యులు ప్రభల కుండా ఉండేందుకు గాను ముందుజాగ్రత్త చర్యలో బాగంగా మురికి కాలువలను శుభ్రం చేయడం, అందులోని చెత్తను గ్రామ శివార్లకు తరలించడం, బ్లీచింగ్ పౌడర్‌ను వీధుల్లో, మురికి కాలుల్లో చల్లడం దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామంలో తాగునీటి ని క్లోరినేషన్ చేసి గ్రామంలోకి వదులుతున్నట్లు వారు చెప్పారు. గ్రామంలో ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అర్ధమండల దీక్ష స్వీకరణ



శివమాలధారణ చేయిస్తున్న వీరశైవ మఠం పీఠాధిపతి

గోనెగండ్ల, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో గురువారం మండల అర్ధమండల దీక్షను శివ భక్తులు ఈశ్వరదేవాలయంలో స్వీకరించారు. దీక్ష మాలధారణ కార్యక్రమం వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. శివరాత్రి రోజున శ్రీశైలంలో దీక్షను విరమిస్తారని పీఠాధిపతి తెలిపారు. ఈ నెల చివరిలో పావుమండల దీక్షలు ప్రారంభమవుతాయాని తెలిపారు. భక్తుల శివనామస్మరణతో ఆలయం మార్మోగింది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న వైసీపీ నాయకులు

కోసిగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 3వ వార్డు వాల్మీకి నగర్‌లో చెందిన కౌతాళం నాగరాజు, పార్వతి దంపతులకు చెందిన గుడిసె అగ్నికి కాలిపోయి సర్వం కోల్పోయి నిరాశ్రయులైన విషయాన్ని ఆంధ్రజ్యోతి దినపత్రికలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. 'సర్వం కోల్పోయాం.. సాయం చేయండి' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి బాదితులకు సహాయసహకారాలు పలువురు దాతలు అందించారు. అందులో భాగంగానే గురువారం మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని బాదితులకు అందించాలని ఎంపీపీ ఈరన్న, వైసీపీ బీసీ విభాగం తాలుకా అధ్యక్షుడు నాడిగేని నాగారాజు ఎమ్మెల్యే అందించిన రూ.20 వేలును బాధిత కుటుంబానికి అందించారు. గత మూడు రోజుల క్రితం వైసీపీ మండల ఇన్‌చార్జి మురళి రెడ్డి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎంపీపీ ఈరన్న

కోసిగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మిగనూరు గ్రామంలో రూ.8.40 లక్షలు మండల పరిషత్ నిధులతో సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ ఈరన్న భూమి పూజ చేశారు. ముఖ్య అతిథిగా వైసీపీ జిల్లా కార్యదర్శి మురళీరెడ్డి హాజరయ్యారు. మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్లు పనులు చేపట్టినట్లు ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ హరూన్ రషీద్, పంచాయతీరాజ్ ఏఈ మాలిక్, సర్పంచ్ ఈరన్న ఉన్నారు.

మంచు కురిసే వేళ...

- కొండలను కప్పేసిన పొగమంచు
- కోసిగిలో వాహనదారుల అవస్థలు



కోసిగిలో ఉదయం 8 గంటలకు కప్పి ఉన్న పొగమంచు

కోసిగి, ఫిబ్రవరి 13(ఆంధ్రజ్యోతి): కోసిగిలో పొగమంచు పర్యాటక ప్రేమికులను ఆకర్షిస్తుతుంటే.. మరోవైపు రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఉదయం 8 గంటలు దాటినా కోసిగిని పొగమంచు కప్పేసింది. అలాగే తిమ్మప్ప, రంగప్ప, బసవన్న కొండలను సైతం మంచుపొగతో కప్పుకుని ఏమీ కనిపించని విధంగా కప్పుకుంది. అలాగే డి.బెళగల్ రోడ్డులోనే పొగ మంచులోనే వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు వాహనదారులు పొగమంచు కారణంగా ముందు వచ్చే వాహనాలు గుర్తించక ప్రమాదల బారిన పడుతున్నారు. వాహనాల లైట్ల వెలుతురులోనే వాహనదారులు ప్రయాణాలు సాగిస్తున్నారు. పొగమంచు కారణంగా పంటలు దెబ్బతింటున్నాయనీ రైతులు ఓ వైపు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం చలి.. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.



పొగమంచులో ప్రయాణిస్తున్న వాహనదారులు